


ESTD: 1999
www.voodayam.com
# వుదయం




ఆదిలాబాద్ 20-10-2026 మంగళవారం సంపుటి : 14 | సంచిక :39 SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily
Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal Follow us on

## ఇంతే కదా...!




# 'ఫ్యూచర్‌సిటీలో పోలీస్ కమిషనరేట్



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 19 (వుదయం) :**

భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలో పర్యటిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇబ్రహీంపట్నంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఫ్యూచర్‌సిటీ పోలీస్ కమిషనరేట్'ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఫ్యూచర్ సిటీ తొలి పోలీస్ కమిషనర్ తరుణ్ జోషిని ఆయన ఆసనంలో కూర్చోబెట్టి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయాన్ని (స్కిల్ యూనివర్సిటీ) సందర్శించడానికి పయనమయ్యారు. ఈ ప్రారంభోత్సవ మహోత్సవంలో శాసన మండలి ముఖ్య విప్ పట్నం మహేందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులైన ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, మల్లు రవిలతో పాటు శాసనసభ్యులు (ఎమ్మెల్యేలు) మల్ రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, కాలె యాదయ్య పాల్గొన్నారు. అలాగే రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, వివిధ ప్రభుత్వ రంగ సంస్థల (కార్పొరేషన్ల) చైర్మన్లు, రాష్ట్ర శాంతిభద్రతల మహానిర్దేశకులు (డీజీపీ) సీవీ ఆనంద్‌తో సహా పలువురు ఉన్నతాధికారులు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు.

# వ్యూహాత్మక బలోపేతమే లక్ష్యం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 19 (ఎఎంఎస్) :** భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు పోలాండ్ ప్రధానమంత్రి డొనాల్డ్ టస్క్ అక్టోబర్ 21 నుండి 23 వరకు భారత్‌లో అధికారికంగా పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా అక్టోబర్ 22న ప్రధాని నరేంద్ర మోదీతో ఆయన ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. గత 2024 ఆగస్టు నెలలో ప్రధాని మోదీ పోలాండ్‌లో పర్యటించిన సమయంలో ఇరు దేశాల సంబంధాలు 'వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెరిగిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో, రెండు దేశాల నడుమ ఉన్న సమగ్ర సంబంధాలను ఇరువురు నేతలు పునఃసమీక్షించనున్నారు. దీనితో పాటు ప్రాంతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలపై పరస్పరం అభిప్రాయాలను పంచుకోనున్నారు. పోలాండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్ బెంగళూరు నగరంలో కూడా పర్యటించనున్నారు. అక్కడ సమాచార సాంకేతికత (ఐటీ), వ్యోమగామి రంగానికి చెందిన వ్యాపార ప్రముఖులతో ఆయన సమావేశమవుతారు. ఈ పర్యటనలో భాగంగా అక్టోబర్ 22న న్యూఢిల్లీలో, అక్టోబర్ 23న బెంగళూరులో 'భారత్ పోలాండ్ వాణిజ్య సదస్సులు' నిర్వహించనున్నారు. ఈ పర్యటన భారత్ పోలాండ్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి, వర్తక వ్యాపారాలు, పెట్టుబడులు, రక్షణ రంగం, నూతన సాంకేతికతలు, పునరుత్పాదక ఇంధనం, విద్య, సంస్కృతి మరియు ప్రజా సంబంధాల రంగాల్లో సహకారాన్ని పెంచడానికి దోహదపడుతుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

## విజయదశమి శుభాకాంక్షలు

విజయదశమి సందర్భంగా 'వుదయం' పాఠకులకు, రిపోర్టర్లకు, శ్రేయోభిలాషులకు
మా హృదయపూర్వక శుభాకాంక్షలు

**సెలవు**

విజయదశమి సందర్భంగా కార్యాలయానికి మంగళవారం సెలవు. కావున బుధవారం పత్రిక వెలువడదు. పునరదర్శనం గురువారం 21వ తేదీ.

**- వుదయం యాజమాన్యం**



































# గ్రేటర్ హైదరాబాద్



## సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నేత ఎ. వినయ్ కుమార్



- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక

**ముషీరాబాద్, అక్టోబర్ 19 (వుదయం):**

తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలను గాంధీనగర్ డివిజన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గాంధీనగర్ డివిజన్ పరిధిలోని అశోక్ నగర్ స్ట్రీట్ నంబర్ 3లో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలకు బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు .ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిని, పూలను ఆరాధిస్తూ, సంప్రదాయాలను భావితరాలకు అందించే గొప్ప పండుగ బతుకమ్మ అని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పే ఈ పండుగను ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు.వేడుకల్లో భాగంగా మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ సంబరాలు చేసుకున్నారు. పండుగ వాతావరణంతో అశోక్ నగర్ వీధులు సందడిగా మారాయి. స్థానిక మహిళలు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు సురేష్‌రాజు, స్థానికులు ఎంవీఆర్ ప్రసాద్, రాజేందర్ రెడ్డి, గీత, సంగీత, పద్మ బసాని, అశోక్ నగర్ స్ట్రీట్ నంబర్ 4కు చెందిన కాలనీ, అపార్ట్‌మెంట్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ప్రభుత్వ నియామక పరీక్షలు





**రంగారెడ్డి జిల్లా**

ప్రభుత్వ నియామక పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, పరీక్షల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా సమన్వయంతో పని చేయాలని – తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ బుర్ర వెంకటేశం, ఐఏఎస్. సోమవారం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ బుర్ర వెంకటేశం, ఐఏఎస్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఈ నెల 24 మరియు 26 తేదీలలో పోస్టులకు నిర్వహించే పరీక్షలను పకడ్బందీగా నిర్వహించెందుకు చేపట్టవలసిన ఏర్పాట్లపై సంబంధిత కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసు శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ నియామక పరీక్షలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో పనిచేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.ప్రజా పరీక్షల నిర్వహణ అత్యంత కీలకమైన బాధ్యత అని, పరీక్షలపై అభ్యర్థుల్లో పూర్తి విశ్వాసం కలిగించేలా అన్ని ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ప్రజా పరీక్షల నిర్వహణలో జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, సంబంధిత శాఖల అధికారులు తమ బాధ్యతలను అత్యంత జాగ్రత్తగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, అభ్యర్థుల తనిఖీలు, పరీక్షా సిబ్బంది నియామకం, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏ ఒక్క పరీక్షా కేంద్రంలోనైనా చోటుచేసుకునే చిన్నపాటి లోపం మొత్తం పరీక్షల విశ్వసనీయతపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.

కంప్యూటర్ ఆధారిత పరీక్షల నిర్వహణలో భాగంగా ప్రశ్నపత్రాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అభ్యర్థులు పరీక్షా హాలులో తమకు కేటాయించిన స్థానాల్లో కూర్చున్న తర్వాతే ప్రశ్నపత్రాలు కంప్యూటర్ స్క్రీన్‌పై అందుబాటులోకి వచ్చే విధానం ద్వారా ప్రశ్నపత్రాల లీకేజీకి అవకాశాలను తగ్గించవచ్చని వివరించారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ ఆధారిత పరికరాలు, ఇతర నిషేధిత వస్తువులను అనుమతించకుండా కఠిన తనిఖీలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫ్రిస్కింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన పోలీస్ సిబ్బందిని ముందుగానే కేటాయించాలని సూచించారు. కేంద్రాల వారీగా అభ్యర్థుల సంఖ్యను పరిగణనలోకి తీసుకొని తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని, చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లకు అవసరమైన శిక్షణ అందించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, బ్యాకప్ సదుపాయాలు, కంప్యూటర్లు, నెట్‌వర్క్ తదితర సాంకేతిక ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.అభ్యర్థులు పరీక్షా సమయానికి కనీసం గంట ముందుగా కేంద్రాలకు చేరుకునేలా సూచనలు జారీ చేయాలని, బయోమెట్రిక్ హాజరు, గుర్తింపు పత్రాల పరిశీలనను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ట్రాఫిక్ అంతరాయాలు, అనవసర గుమిగూడటం, ర్యాలీలు లేదా ఇతర కార్యక్రమాల వల్ల అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర వైద్య సహాయం అవసరమైన అభ్యర్థులకు మానవీయ దృక్పథంతో తక్షణ సహకారం అందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ నియామక పరీక్షల నిర్వహణలో జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ, పరీక్షల నిర్వహణ సంస్థలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశించిన ప్రామాణిక కార్యాచరణ విధానాలను (SOPs) ఖచ్చితంగా అమలు చేయాలని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించి అభ్యర్థుల్లో ప్రభుత్వ వ్యవస్థపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు.కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా రెవెన్యూ అధికారి శారద దేవి మాట్లాడుతూ ఈ నెల 24 మరియు 26 తేదీలలో పోస్టులకు సంబంధించి జిల్లాలో 15 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నెల 24వ తేదీన నిర్వహించే మొదటి రోజు పరీక్షకు 5,935 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, అదే విధంగా 26వ తేదీన నిర్వహించే రెండో రోజు పరీక్షకు 5,035 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, పరీక్షల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే ఫ్లయింగ్, లైన్ స్క్వాడ్‌స్‌ను నియమించినట్లు, పరీక్షలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు.

## ఉద్యోగ భద్రతకై వినూత్న నిరసన

**నాగర్ కర్నూల్ రూరల్, అక్టోబర్ 19 (వుదయం ప్రతినిధి):**



ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పెరిగిన వేతనాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్ హెచ్ ఎం) ఉద్యోగులు వినూత్న నిరసనకు దిగారు. కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ముందుండి వైద్య సేవలందించి వేలాది మంది ప్రాణాలను కాపాడిన తాము, నేడు ఉద్యోగ భద్రత కోసం రోడ్డెక్కాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనల్లో భాగంగా 7వ రోజైన ఆదివారం ఉరి తాళ్లను మెడలో వేసుకుని నిరసన తెలిపి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎన్ హెచ్ ఎం పరిధిలో వేలాది మంది ఉద్యోగులు ఏళ్ల తరబడి వైద్య ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్నారని, అయినప్పటికీ వారి ఉద్యోగాలకు ఎటువంటి భరోసా లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 60, 1195 ప్రకారం పెరిగిన వేతనాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న తమ సేవలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు.ప్రధాన డిమాండ్లు: ఎన్ హెచ్ ఎం ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలి, జీవో ప్రకారం పెరిగిన వేతనాలను అమలు చేయాలి, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ లో పనిచేస్తున్న అర్హులను రెగ్యులరైజ్ చేయాలి, సమాన పనికి సామాజిక భద్రత కల్పించాలి, ఖాళీ పోస్టులను భర్తీ చేసి పనిభారాన్ని తగ్గించాలి. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు డాక్టర్ జగన్ లాల్, ప్రధాన కార్యదర్శి డి. కుమార్, రాష్ట్ర కోఆర్డినేటర్ గౌస్ పాషా, జిల్లా ఎన్ హెచ్ ఎం సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోతులబోగూడలో ఘనంగా దుర్గామాత కుంకుమార్చన

- పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళా భక్తులు

**వట్‌పల్లి, అక్టోబర్ 19 (వుదయం ప్రతినిధి)**

మండల పరిధిలోని పోతులబోగూడ గ్రామంలో దుర్గామాత అమ్మవారి ఆలయం వద్ద సోమవారం కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ముద్దపురం రాజు, దుర్గామాత ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చనలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని భక్తులు ప్రార్థించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



## ఓల్డ్ గ్యాస్ మండి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

- అమ్మవారికి ప్రత్యేక పూజలు.. భక్తిశ్రద్ధలతో అన్నప్రసాద వితరణ

**ముషీరాబాద్, అక్టోబర్ 19 (వుదయం):**



ఓల్డ్ గ్యాస్ మండి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు ప్రభాస్ చక్రం నేతృత్వంలో అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్లేష్, దుర్గా హాజరయ్యారు.కార్యక్రమంలో భాగంగా ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, లోకకల్యాణం కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేస్తూ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. అన్నదానం మహాదానమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో సేవాభావాన్ని, మానవత్వాన్ని, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భక్తి, సేవాభావంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీంకు, శ్రవణ్, సంతోష్, విక్రమ్, శ్రీను, నవీన్ జోషి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, విజయాలు వెల్లివిరియాలి..

- పటాన్చెరు నియోజకవర్గ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే జీఎంఆర్..
- తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పటాన్చెరులో అద్భుత ప్రగతి..

**పటాన్చెరు**

చెడుపై మంచి, అధర్మంపై ధర్మం, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పర్వదినం సందర్భంగా పటాన్చెరు నియోజకవర్గ ప్రజలందరికీ స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) హృదయపూర్వక దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారికి, మాజీ మంత్రివర్యులు హరీష్ రావు గారికి, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ కెసిఆర్ గారి నాయకత్వంలో పటాన్చెరు నియోజకవర్గ అద్భుతమైన ప్రగతి పథంలో ముందుకు వెళ్లిందని తెలిపారు. దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలను చిగురింపజేస్తూ, ఆనందం, ఆత్మవిశ్వాసం, విజయాలకు నాంది పలకాలని ఆయన ఆకాంక్షించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా, చెడు ఎంతటి శక్తిమంతమైనదైనా అంతిమ విజయం మంచికే దక్కుతుందనే గొప్ప సందేశాన్ని విజయదశమి మనకు అందిస్తుందని పేర్కొన్నారు.ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు విరజిమ్మాలి.. ప్రతి కుటుంబంలో సిరిసంపదలు వెల్లివిరియాలి.. ప్రతి ఒక్కరి జీవితంలో విజయాలు సొంతం కావాలి అని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని, కుటుంబాల మధ్య ప్రేమానురాగాలు, సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని కోరుకున్నారు.ప్రజల ఆశయాలు నెరవేరి, ప్రతి ఒక్కరి జీవితంలో అభివృద్ధి, సంక్షేమం, సంతోషం నిండాలని ఆకాంక్షిస్తూ.. పటాన్చెరు నియోజకవర్గ ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి విజయదశమి పండుగను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే జీఎంఆర్ పిలుపునిచ్చారు.



## పూల పండుగలో గుర్రం తోట వీధి హోరెత్తింది!

- బతుకమ్మ సంబురాల్లో ఆడపడుచుల జోరు.. ఆటపాటలతో మార్మోగిన వీధి

**అయిజ అక్టోబర్ 19 (వుదయం ప్రతినిధి)**



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెబుతూ బతుకమ్మ సంబురాలు జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ మున్సిపాలిటీ గుర్రం తోట వీధిలో అంబరాన్నంటాయి. వీధికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూల పండుగను ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ వస్త్రధారణలో ముస్తాబైన మహిళలు బతుకమ్మ పాటలతో హోరెత్తించారు. లయబద్ధమైన పాటలు, ఉత్సాహభరితమైన ఆటపాటలతో వీధంతా పండుగ సందడి నెలకొంది. పూల సోయగాలు, మహిళల కోలాహలం గుర్రం తోట వీధికి ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐకమత్యానికి, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ.. మన సంస్కృతీ సంప్రదాయాల గొప్పతనాన్ని మరోసారి చాటిచెప్పింది. తరతరాలుగా వస్తున్న సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూ మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొనడంతో గుర్రం తోట వీధి పూలవనాన్ని తలపించింది.

## మహిషాసురమర్దినిగా గాయత్రీమాత దివ్యదర్శనం

**వుదయం ప్రతినిధి**



ఘట్‌కేసర్ అక్టోబర్ 19మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం 8వ డివిజన్ అన్నోజిగూడ గాయత్రీమాత ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. సోమవారం అమ్మవారు మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దివ్యదర్శనం ఇచ్చారు. సర్వాలంకార శోభితంగా కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేదమంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.వేదపండితుల ఆధ్వర్యంలో గణపతి, లక్ష్మీ గణపతి, నవగ్రహ సహిత నవచండీ హోమం, నిత్య కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని జరిపించారు. లోకకల్యాణం, ప్రజల సుఖశాంతుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు భక్తులకు ఆశీర్వచనాలు అందజేయగా, ఆలయ కమిటీ సభ్యులు పండితులను ఘనంగా సన్మానించారు. అనంతరం బోయపల్లి రాజేశ్వర్ రెడ్డి, స్వప్న దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పోచారం మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, సిద్ధి రాములు గుప్తా, మోహన్ రావు, రాష్ట్ర గిరిజన నాయకుడు జితేందర్ నాయక్, కేఎం రెడ్డి, అంజద్ ఖాన్, చంద్రమోహన్ రెడ్డి, సంతోష్‌నాయక్, లక్ష్మణ్ యాదవ్, తిలక్ నాయక్, మాన్విక్ రెడ్డి, ప్రన్విక్ రెడ్డి, కార్తిక్ పంతులు, కౌశిక్ పంతులు, రామ్మూర్తి పంతులు, ప్రసాద్ పంతులు, వేణు గోపాల్ పంతులు, వినీల్, కౌశల్, నవనీత్ తదితరులు పాల్గొన్నారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది...

## యువ క్రికెటర్లకు స్పాన్సర్ డి. సోలమన్ ప్రవీణ్ ప్రోత్సాహం

- దసరా క్రికెట్ టోర్నమెంట్ విజేత జట్టుకు రూ.10 వేల నగదు బహుమతి

**కోహీర్, అక్టోబరు 19 (వుదయం ప్రతినిధి):**

దసరా పండుగ సందర్భంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ మండలం పైడిగుమ్మల్ గ్రామంలో నిర్వహించిన విలేజ్ లెవల్ దసరా క్రికెట్ టోర్నమెంట్ సీజన్1 ఉత్సాహభరితంగా సాగింది. ఈ పోటీల్లో విజేతగా నిలిచిన జట్టుకు బీఆర్ఎస్ నాయకుడు, టోర్నమెంట్ స్పాన్సర్ డి. సోలమన్ ప్రవీణ్ రూ.10 వేల నగదు బహుమతిని అందజేసి యువ క్రికెటర్లను ప్రోత్సహించారు.గ్రామీణ ప్రాంతాల్లోని యువ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు వారిలో క్రీడాస్ఫూర్తి, ఐకమత్యం, క్రమశిక్షణను పెంపొందించాలనే లక్ష్యంతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహించారు. పోటీల్లో యువ క్రికెటర్లు ఉత్సాహంగా పాల్గొని తమ ఆటతీరుతో క్రీడాభిమానులను ఆకట్టుకున్నారు. టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన జట్టుకు డి. సోలమన్ ప్రవీణ్ రూ.10 వేల నగదు బహుమతిని అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆయన ముందుకు రావడంపై క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.



ఇలాంటి పోటీలు యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు.

## వేణు యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా పూల పండుగ సంబరాలు

**ముషీరాబాద్, అక్టోబర్ 18 (వుదయం):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలను కవాడిగూడ క్రాస్‌రోడ్స్‌లో వేణు యాదవ్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో మహిళలు, స్థానికులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని పండుగ సంబరాలను అంబరాన్నంటేలా జరుపుకున్నారు. బతుకమ్మ పాటలు, ఆటలతో ఆ ప్రాంతమంతా పండుగ శోభను సంతరించుకుంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ నాయకులు ఎం.ఎన్. శ్రీనివాస్ రావు హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతితో ముడిపడిన మన సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ప్రతి సంవత్సరం గుర్రం రాధిక పెద్ద ఎత్తున బతుకమ్మను తయారు చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. బతుకమ్మ వేడుకల ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని నలుగురికీ చాటిచెబుతూ పండుగ విశిష్టతను భావితరాలకు పరిచయం చేయడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.తెలంగాణ సంస్కృతిని కాపాడుతూ, సంప్రదాయాలను కొనసాగించాలనే సంకల్పంతో నిర్వహించిన ఈ వేడుకలు స్థానికుల్లో ఆనందోత్సాహాలను నింపాయి. ఈ కార్యక్రమంలో కార్తీక్ యాదవ్, టీంకు, శ్రవణ్, విక్రమ్, సాయి, శివ, బాలు తదితరులు పాల్గొన్నారు.

## తోటకూర వజ్రేష్‌కు సింగిరెడ్డి జన్మదిన శుభాకాంక్షలు



- మరింత రాజకీయ ఉన్నతిని సాధించాలని ఆకాంక్ష

**మేడిపల్లి వుదయం ప్రతినిధి అక్టోబర్ 19.**

మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదిన వేడుకలు బోడుప్పల్ దేవి కన్వెన్షన్ హాల్లో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి తోటకూర వజ్రేష్ యాదవ్ ను ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో ఉండాలని, రాజకీయంగా మరింత ఉన్నతిని సాధించి ప్రజలకు మరింత మెరుగైన సేవలు చేయాలని సింగిరెడ్డి పద్మా రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సీసవెంకటేష్ గౌడ్,

చెంగిచెర్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సింగిరెడ్డి రాజిరెడ్డి, పార్టీ నాయకులు మోదుగు శేఖర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కౌసల్య కాలనీలో ఘనంగా దేవి శర్నవరాత్రుల వేడుకలు



**బాచుపల్లి, అక్టోబర్ 19,(వుదయం ప్రతినిధి ),**

బాచుపల్లి విలేజ్ కౌసల్య కాలనీలో శ్రీ వెంకట శివరామ ఆలయ ధర్మకర్త, ఎన్ఎంసి 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను అందంగా అలంకరించి, ఆట పాటలతో సంబురంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగతో దుర్గాదేవి శరన్నవరాత్రుల సందర్భంగా కౌసల్య కాలనీలోని శ్రీ వెంకట శివ రామాలయంలో అమ్మవారిని ఎమ్మెల్యే కే.పి. వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు దర్శించుకున్నారు.అనంతరం ఆలయ ధర్మకర్త 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ వారిని శాలువాలతో సత్కరించి, మెమోటో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HONORABLE V JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABAD**
**O.S.NO. 1713 OF 2026**

**Between :**
Smt. Sunanda Nandyala and two others ...**Plaintiffs**

**AND**

Mandal Revenue Officer and another ...**Defendants**

TO
ALL CONCERNED

Take notice that the above said Plaintiffs for declaration, to declare them as the legal heirs of late Nandyala Lakshmi Reddy, who died on 07-01-2019, on the above-mentioned court and the matter stood posted to **28-10-2026** for objections from anybody. If no objection is received, it will be decided in accordance with law.

( By Order of the Court )
Sd/-
B.Ravishankar
Advocate
# 305-C, Pancom Business Centre, Ameerpet X Roads
Hyderabad-500 073. Cell NO.9849131453

**IN THE COURT OF CHIEF JUDGE -CUM- MACT , CITY CIVIL COURTS, At: Chatta Bazar, Hyderabad.**
**MVOP No. 1501 of 2026**

**Between :**
Shankar Bore, ..... **Petitioner / s.**

**AND**

Laxmi Prasanna.M., & Anothers. .............**Respondent / s.**

**To,**
**Prashanth.R., S/o:Not known, Age:35 years,Occ:Rider, R/o:8-297, Hill Colony, Hayath Nagar, Ranga Reddy-500070**

Take this Notice that the petitioner herein has filed the above M.V.O.P. against you and another respondent by claiming compensation before the above mentioned Court. Hence the above M.V.O.P. is posted for your appearance and counter. If you fail to appear before the above mentioned Court on 02-11-2026 by 10.30 a.m., the matter will be decided in your absence.

**( By Order of the Court )**
At: Chatta Bazar, Hyderabad.
Date: 19-10-2026

**Sd/-**
**PUTTA THIRUPATHI REDDY**
**(AP/52/1996) MA (Eco), LLM (Con)**
**ADVOCATE**
**Flat No:1, Ravi Residency Apartment, H.No:13-4-48/F/1, Opp:Central Bank of India, left side to Rajadhani Theater, Vikas Nagar, Dilsukh Nagar, Hydrabad (Town & Dist.) Telangana (State), PIN:500060. Phone: 9440687160.**
**Mail id: putta.thirupathireddy@gmail.com**



"దేశంలో ఓట్ల చోరీ ప్రణాళికను రూపొందించిన ప్రధాని మోడీయే. తెర వెనుక ఆయన రచించిన ప్రణాళికను కేంద్ర హోం మంత్రి అమిత్ షా కార్యరూపంలోకి తీసుకొచ్చారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అమలు చేశారు. ప్రస్తుతం ఈ ముగ్గురూ నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారు. ఓట్ల చోరీకి వారు తగిన మూల్యం చెల్లించుకుంటారు. నాపై 45పై పరువు నష్టం కేసులున్నాయి. మోడీ, అమిత్ షాల సన్నిహితులు దాఖలు చేసినవి వాటిలో ఉన్నాయి. అయితే ఓట్ల చోరీలో ప్రధాని పాత్ర ఉందని నేనన్నందుకు ఒక్క కేసు కూడా ఎవరూ నాపై నమోదు చేయలేదు. ఎందుకంటే ఓట్ల చోరీఆరోపణలకు సంబంధించి కేసు నమోదైతే అది పూర్తి స్థాయిలో చట్టపరమైన వ్యవహారంగా మారుతుంది. అందులో వారు చిక్కుకుపోతారు."

- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత

## వే'మన' పద్యం

మొదట ఆశబెట్టి తుదిలేదుపొమ్మను
పరమ లోభులైన పాపులకును
ఉసురు తప్పకంటు నుండేలు దెబ్బగా
విశ్వదాభిరామ వినురవేమ



## సంపాదకీయం

# ఈవ్యర్థాలు విసిరిన సవాలు!

సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవితాన్ని వేగవంతం చేసింది. ఒకప్పుడు విలాస వస్తువులుగా భావించిన సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు నేడు నిత్యావసరాలుగా మారాయి. సమాచార మార్పిడి నుంచి విద్య, వైద్యం, వ్యాపారం వరకు ప్రతి రంగంలోనూ ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం అనివార్యమైంది. అయితే, సాంకేతిక అభివృద్ధి ఎంత వేగంగా సాగుతోందో, దానికి అనుగుణంగా ఉత్పత్తి అవుతున్న ఈవ్యర్థాల సమస్య కూడా అంతే వేగంగా తీవ్రమవుతోంది. కొత్త పరికరాలపై మోజు, పాతవాటిని మరమ్మతు చేయించుకోవడం కంటే మార్చుకోవడానికే మొగ్గుచూపడం, వ్యర్థాల సేకరణపై అవగాహన లోపం కలిసి పర్యావరణానికి కొత్త ముప్పును సృష్టిస్తున్నాయి. అభివృద్ధికి ప్రతీకలుగా నిలుస్తున్న ఎలక్ట్రానిక్ పరికరాలే, వాటి వినియోగం ముగిసిన తర్వాత కాలుష్య కారకాలుగా మారడం ఆందోళనకరం. ఈవ్యర్థాలను సాధారణ చెత్తగా పరిగణించడం అత్యంత ప్రమాదకరం. సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, టెలివిజన్లు, బ్యాటరీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల్లో సీసం, పాదరసం, కాడ్మియం వంటి హానికర పదార్థాలు ఉంటాయి. వీటిని విచక్షణారహితంగా పడేయడం, బహిరంగ ప్రదేశాల్లో కాల్చడం లేదా శాస్త్రీయ పద్ధతులు పాటించకుండా విడదీయడం వల్ల నేల, నీరు, గాలి కలుషితమవుతాయి. ఈ కాలుష్యం మానవ ఆరోగ్యంపై, ముఖ్యంగా నాడీ వ్యవస్థ, మూత్రపిండాలు, శ్వాసకోశంపై ప్రతికూల ప్రభావాలు చూపే ప్రమాదం ఉంది. అందువల్ల ఈవ్యర్థాల నిర్వహణను కేవలం పర్యావరణ పరిరక్షణ అంశంగా కాకుండా, ప్రజారోగ్యం, భవిష్యత్ తరాల భద్రతకు సంబంధించిన కీలక బాధ్యతగా చూడాలి. ఈ విషయంలో తెలంగాణ కూడా మరింత దృష్టి సారించాల్సి ఉంది. రాష్ట్రంలో నమోదైన ఈవ్యర్థాల రీసైక్లర్ల సంఖ్య 2023-24లో 14 ఉండగా, 2024-25లో 19కి పెరిగినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. హైదరాబాద్‌లో ఈవ్యర్థాల రీసైక్లింగ్ సాంకేతికతల అభివృద్ధికి ప్రత్యేక పరిశోధన, అభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయడం ఈ రంగానికి పెరుగుతున్న ప్రాధాన్యతను తెలియజేస్తోంది. అయితే, రీసైక్లర్ల సంఖ్య పెరగడమే సమస్యకు సంపూర్ణ పరిష్కారం కాదు. పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ సులభంగా అందుబాటులో ఉండే సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. పాత మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ఛార్జర్లు, బ్యాటరీలను ఎక్కడ అప్పగించాలో ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలి. స్థానిక సంస్థలు, విద్యుత్, ఎలక్ట్రానిక్ వస్తువుల విక్రయదారులు, తయారీ సంస్థలు సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ రూపొందించాలి. ఈవ్యర్థాలు పర్యావరణానికి భారమే కాదు.. ఆర్థికంగా విలువైన వనరుల నిల్వ కూడా. వీటిలో బంగారం, వెండి, రాగి, అల్యూమినియం, పల్లాడియం వంటి విలువైన లోహాలు ఉంటాయి. ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా వీటిని తిరిగి వెలికితీయవచ్చు. పనికొచ్చే పరికరాలను మరమ్మతు చేసి పునర్వినియోగంలోకి తీసుకురావచ్చు. ఇలా చేయడం వల్ల సహజ వనరులపై ఒత్తిడి తగ్గడమే కాకుండా, కొత్త లోహాల తవ్వకం, శుద్ధి కోసం అవసరమయ్యే శక్తి, ముడిసరుకుల వినియోగం కూడా తగ్గుతుంది. ఈ విధానం వృథాను తగ్గించి వనరులను తిరిగి ఆర్థిక వ్యవస్థలోకి తీసుకువచ్చే సర్క్యులర్ ఎకానమీకి బలాన్నిస్తుంది. ఈవ్యర్థాల సమస్యను ఎదుర్కోవడానికి దేశంలో చట్టపరమైన వ్యవస్థ కూడా ఉంది. 2011లో తొలిసారిగా ఈవ్యర్థాల నిర్వహణకు నిబంధనలు తీసుకురాగా, 2016లో కొత్త నిబంధనలు రూపొందించారు. అనంతరం సవరణలు జరిగాయి. ప్రస్తుతం ఈవ్యర్థాల నిర్వహణ నిబంధనలు, 2022, 2023 ఏప్రిల్ 1 నుంచి అమల్లో ఉన్నాయి. వీటిలో విస్తరించిన ఉత్పత్తిదారుల బాధ్యతకు (ఈపీఆర్) ప్రాధాన్యత కల్పించారు. అంటే, ఎలక్ట్రానిక్ పరికరాలను తయారు చేసే సంస్థలు వాటి వినియోగం ముగిసిన తర్వాత ఏర్పడే వ్యర్థాల నిర్వహణకు నిబంధనలకు అనుగుణంగా బాధ్యత వహించాలి. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిర్వహించే ఈపీఆర్ వ్యవస్థ ద్వారా సంబంధిత సంస్థల నమోదు, వాటి బాధ్యతల పర్యవేక్షణకు ఏర్పాట్లు ఉన్నాయి. అయితే, చట్టాలు ఉండటం ఒక ఎత్తయితే, వాటిని క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయడం మరో ఎత్తు. తయారీ సంస్థలు తమ బాధ్యతలను నిజాయతీగా నిర్వర్తిస్తున్నాయా? రీసైక్లింగ్ సంస్థలు పర్యావరణ ప్రమాణాలను పాటిస్తున్నాయా? అనధికారికంగా వ్యర్థాలను సేకరించి ప్రమాదకర పద్ధతుల్లో విడదీసే కార్యకలాపాలను అరికడుతున్నారా? అనే అంశాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం. వినియోగదారులకు కూడా తమ పాత పరికరాలను అధికారిక సేకరణ కేంద్రాలకు అప్పగించేలా ప్రోత్సాహకాలు కల్పించాలి. ఉత్పత్తిదారులు, రీసైక్లర్లు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేసినప్పుడే చట్టాల అసలు లక్ష్యం నెరవేరుతుంది. సాంకేతిక అభివృద్ధిని ఆపడం సాధ్యం కాదు.. ఆపాల్సిన అవసరమూ లేదు. కానీ అభివృద్ధి పేరుతో ప్రకృతిపై మోపుతున్న భారాన్ని తగ్గించడం మాత్రం మన బాధ్యత. కొత్త పరికరాలను కొనుగోలు చేయడంలో చూపుతున్న ఆసక్తిలో కొంతైనా వాటి వినియోగం ముగిసిన తర్వాత బాధ్యతాయుతంగా నిర్వహించడంపై చూపాలి. ప్రభుత్వాలు పటిష్టమైన వ్యవస్థలను నిర్మించాలి. కంపెనీలు తమ బాధ్యతను గుర్తించాలి. ప్రజలు తమ వంతు సహకారం అందించాలి. ఈ మూడు కలిసి పనిచేసినప్పుడే ఈవ్యర్థాలు పర్యావరణ విపత్తుగా మారకుండా అడ్డుకోవచ్చు. నిర్లక్ష్యంగా పారేస్తే అనర్థాలకు కారణమయ్యే వ్యర్థాలే, శాస్త్రీయంగా సేకరించి రీసైక్లింగ్ చేస్తే సంపదగా మారతాయి. వ్యర్థాలను తగ్గించడం, వనరులను తిరిగి వినియోగించడం, ప్రకృతిని కాపాడటం— ఇవే నిజమైన సాంకేతిక అభివృద్ధికి కొలమానాలు కావాలి.

### రచనలు పంపండి

ఉదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# విజయదశమి దహించాల్సింది రావణుడిని కాదు, రావణత్వాన్ని

దసరా వచ్చింది ... రావణుడి దిష్టిబొమ్మలు దగ్ధమవుతాయి. ఆకాశంలో నిప్పురవ్వలు విరజిమ్ముతాయి. మైదానాలు చప్పట్లతో మారుమోగుతాయి. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమిని వైభవంగా జరుపుకుంటాం. కానీ, ప్రతి ఏటా రావణుడి బొమ్మను కాలుస్తున్న మనం మనలోని చెడును ఎంతవరకు దహనం చేసుకోగలుగుతున్నాం? అహంకారం, అసూయ, ద్వేషం, స్వార్థం వంటి అవలక్షణాలను విడిచిపెట్టి మానవత్వంతో జీవించగలుగుతున్నామా? లేక రావణుడి దిష్టిబొమ్మతోపాటు మన బాధ్యతలను కూడా అగ్నికి ఆహుతి చేస్తున్నామా?విజయదశమి అంటే కేవలం ఒక పండుగ కాదు. అది ధర్మం అధర్మంపై సాధించిన విజయానికి ప్రతీక. మనిషిలోని చెడును గుర్తించి, మంచిని ఆచరణలో పెట్టుకోవాల్సిన సందర్భం. అయితే పండుగ వెనుక ఉన్న అంతరార్థాన్ని విస్మరించి, ఆచారాలకే పరిమితమైతే దాని పరమార్థం నెరవేరినట్లేనా? ఈ ప్రశ్నకు సమాధానం మనం జరుపుకునే వేడుకల్లో లేదు. మనం జీవించే విధానంలో ఉంది.రావణుడికి పది తలలు... ఆధునిక మనిషికి కనిపించని ముఖాలెన్నో!

రావణుడికి పది తలలు ఉన్నాయని పురాణాలు చెబుతున్నాయి. కానీ, నేటి ఆధునిక మానవుడు ధరించే కనిపించని ముఖాలెన్నో! ఎదుటివారిపై ప్రేమను కురిపిస్తూనే, వెనుక అసూయను వెళ్లగక్కే మనస్తత్వాలు ఎన్నో! పైకి ఆప్యాయతను ప్రదర్శిస్తూ, లోలోపల అక్కసును పెంచుకునే మనుషులెందరో! మాటల్లో మాధుర్యం... మనసులో విషం! ముఖంపై చిరునవ్వు... అంతరంగంలో అసూయ! అవసరమైనప్పుడు ఆత్మీయులుగా నటిస్తూ, అవసరం తీరగానే అపరిచితులుగా మారిపోయే సంబంధాలు మన చుట్టూ కనిపిస్తూనే ఉన్నాయి.ఒకరి ఎదుగుదలను చూసి అభినందించే హృదయాల కంటే, ఆ ఎదుగుదలను అడ్డుకోవాలనే ఆలోచనలు పెరుగుతున్నాయా అనిపించే పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇతరుల విజయాన్ని తమ విజయంగా భావించే విశాల హృదయం క్రమంగా కనుమరుగవుతోంది. ఎదుటివారి కష్టంలో తోడుగా నిలవాల్సిన మనిషి, కొన్నిసార్లు వారి బలహీనతలను తనకు అనుకూలంగా మలుచుకుంటున్నాడు.ఐకమత్యం కూడా కొన్నిసార్లు స్వార్థ ప్రయోజనాలకే పరిమితమవుతోంది. తమకు లాభం చేకూర్చే అంశాల దగ్గర అందరూ ఒక్కటవుతారు. కానీ, అన్యాయాన్ని ఎదిరించాల్సి వచ్చినప్పుడు, బాధితుడికి అండగా నిలవాల్సి వచ్చినప్పుడు ఆ ఐకమత్యం ఏమవుతోంది? ప్రయోజనం ఉన్నంతవరకే స్నేహాలు, అవసరం ఉన్నంతవరకే అనుబంధాలు కొనసాగితే వాటిని నిజమైన మానవ సంబంధాలుగా ఎలా పరిగణించగలం?మనిషి సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్నాడు. ప్రపంచాన్ని అరచేతిలోకి తెచ్చుకుంటున్నాడు. కానీ, పక్క మనిషి మనసును అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తున్నాడా? సమాచారాన్ని పంచుకునే వేగం పెరిగింది... ఆప్యాయతను పంచుకునే మనసు తగ్గిందా? పరిచయాలు పెరుగుతున్నాయి... నిజమైన అనుబంధాలు తగ్గుతున్నాయా? మనిషి సాధిస్తున్న అభివృద్ధితోపాటు మానవత్వం కూడా ఎదగాలి కదా!అందుకే మనం కాల్చాల్సింది కేవలం రావణుడి ప్రతిరూపాన్ని కాదు. మనలో దాగి ఉన్న కపటత్వాన్ని, అసూయను, ద్వేషాన్ని, ఇతరుల పట్ల మనకున్న చిన్నచూపును కూడా దహనం చేయాలి. సమాజం మారాలని కోరుకునే ముందు మన ఆలోచనలను మనం ప్రశ్నించుకోవాలి. ఎందుకంటే, మనిషిలో మార్పు రాకుండా సమాజంలో మార్పు రావాలని ఆశించడం అర్థరహితం.శమీ వృక్షం సాక్షిగా... మేల్కొనాల్సిన ధర్మచైతన్యం!విజయదశమికి రావణ దహనంతోపాటు మహాభారతంతో ముడిపడిన మరో విశిష్టమైన సంప్రదాయం కూడా ఉంది. పాండవులు అజ్ఞాతవాసానికి వెళ్లే సమయంలో తమ ఆయుధాలను శమీ వృక్షంపై దాచిపెట్టారని, అజ్ఞాతవాసం ముగిసిన అనంతరం అర్జునుడు వాటిని తిరిగి స్వీకరించాడని పురాణగాథ చెబుతుంది. ఈ ఘట్టం విజయదశమి సంప్రదాయంతో ముడిపడి ఉంది.ఆయుధాలు కేవలం యుద్ధ సాధనాలు మాత్రమే కాదు. ఈ కథను మన జీవితాలకు అన్వయించుకుంటే అవి ధైర్యానికి, ఆత్మవిశ్వాసానికి, ధర్మాన్ని కాపాడే సంకల్పానికి ప్రతీకలుగా భావించవచ్చు. పాండవులు తమ ఆయుధాలను తిరిగి స్వీకరించినట్లే, మనిషి కూడా తనలో నిద్రాణంగా ఉన్న మంచితనాన్ని మేల్కొలపాలి. అన్యాయం ఎదురైనప్పుడు ప్రశ్నించే ధైర్యాన్ని, బలహీనులకు అండగా నిలిచే మనసును, ఇతరుల విజయాన్ని చూసి అభినందించే విశాల హృదయాన్ని తిరిగి పొందాలి. మనలోని నిజాయితీ, వివేకం, మానవత్వం అనే ఆయుధాలను ధర్మం కోసం ఉపయోగించాలి. తప్పును చూసి మౌనంగా ఉండటం తటస్థత కాదు; కొన్నిసార్లు అది అన్యాయానికి పరోక్షంగా అండగా నిలిచినట్లే అవుతుంది.శమీ వృక్షం నుంచి ఆయుధాలను వెలికి తీయడం ఒక పురాణ ఘట్టం.మనిషిలో నిద్రాణమైన మానవత్వాన్ని వెలికి తీయడం నేటి సమాజానికి అవసరమైన ధర్మ యుద్ధం!తొమ్మిది రోజులూ దేవీపూజ... జీవితాంతం స్త్రీకి గౌరవం ఏది?దుర్గానవరాత్రులు వచ్చాయంటే చాలు... తొమ్మిది రోజులూ అమ్మవారిని తొమ్మిది రూపాల్లో భక్తిశ్రద్ధలతో పూజిస్తాం. పూలతో అలంకరిస్తాం. పట్టువస్త్రాలు సమర్పిస్తాం. నైవేద్యాలు పెడతాం. ఉపవాసాలు ఉంటాం. దుర్గమ్మను శక్తిస్వరూపిణిగా, జగన్మాతగా కీర్తిస్తాం. అమ్మవారి అనుగ్రహం కోసం ప్రార్థిస్తాం. కానీ, ఆ తొమ్మిది రోజుల పూజల్లో చూపించే భక్తి... మన జీవితాల్లో స్త్రీ పట్ల చూపించే గౌరవంలో ఎందుకు కనిపించడం లేదు?తొమ్మిది రోజులూ దేవిని పూజించే చేతులు...స్త్రీని మనిషిగా గౌరవించడంలో మాత్రం ఎందుకు వెనుకబడుతున్నాయి?గర్భగుడిలో అమ్మవారికి కర్పూర హారతులు ఇస్తున్నాం. కానీ, గడప దాటి బయటకు వచ్చిన తర్వాత స్త్రీ ఆత్మగౌరవాన్ని కాపాడటంలో విఫలమవుతున్నాం. అమ్మవారి ముందు తలవంచుతున్నాం... కానీ, స్త్రీని అవమానించే ముందు మన అహంకారాన్ని తలవంచించలేకపోతున్నాం. దేవిని శక్తిగా ఆరాధిస్తున్నాం... కానీ, ఒక మహిళ తన శక్తిని నిరూపించుకోవడానికి ప్రయత్నించినప్పుడు ఆమెకు అండగా నిలవలేకపోతున్నాం.ఇక్కడే మన భక్తికీ, మన ప్రవర్తనకీ మధ్య ఉన్న అంతరం స్పష్టమవుతోంది. దేవిని పూజించడం మన సంప్రదాయం కావచ్చు. కానీ, స్త్రీని గౌరవించడం మన సంస్కారం కావాలి. పూజలు మన విశ్వాసాన్ని ప్రతిబింబిస్తే, మన ప్రవర్తన మన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది.

"యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః" అనే సంస్కృత సూక్తి స్త్రీలు గౌరవించబడే చోట దేవతలు ఆనందంగా కొలువై ఉంటారని చెబుతుంది. స్త్రీని ఆదిపరాశక్తిగా, జగన్మాతగా, దుర్గాదేవిగా ఆరాధించే సంప్రదాయం మనది. అయినా, పసిపాప నుంచి పండు ముదుసలి వరకు స్త్రీలు అఘాయిత్యాలకు గురవుతున్నప్పుడు మన సంస్కారానికి అర్థమేమిటి? ఒకవైపు అమ్మవారికి పూలు సమర్పిస్తూ, మరోవైపు స్త్రీలపై జరుగుతున్న హింసను చూస్తూ మౌనంగా ఉండటం ఎలాంటి వైరుధ్యం?స్త్రీలపై అఘాయిత్యాలు జరిగినప్పుడు బాధితురాలినే ప్రశ్నించడం, ఆమె దుస్తులను లేదా ప్రవర్తనను తప్పుబట్టడం మరో అన్యాయం. నేరానికి పాల్పడిన వ్యక్తిని ప్రశ్నించాల్సిన సమాజం బాధితురాలినే వివరణ అడిగితే న్యాయానికి అర్థం ఏముంటుంది? ఒక ఆడపిల్ల బయటకు వెళ్లినప్పుడు ఎక్కడికి వెళ్తోంది, ఎప్పుడు తిరిగి వస్తుంది అని ఆందోళన చెందే సమాజం

... ఆమెను భయపెట్టే వికృత మనస్తత్వాలను మార్చడానికి ఎంతగా ప్రయత్నిస్తోంది?ఆడపిల్లకు జాగ్రత్తలు చెప్పడం అవసరమే. కానీ, ఆమె స్వేచ్ఛను కుదించడం మాత్రమే రక్షణ కాదు. స్త్రీ అనుమతి లేకుండా ఆమెను తాకే హక్కు ఎవరికీ లేదని గుర్తించడం, ఆమె అభిప్రాయాలకు విలువనివ్వడం, ఆమె స్వేచ్ఛను గౌరవించడం ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలి.ఆమె అడుగులకు ఆంక్షలు విధించడం కాదు పరిష్కారం... ఆమె అడుగులు భయం లేకుండా సాగే సమాజాన్ని నిర్మించడమే నిజమైన పరిష్కారం!స్త్రీని దేవతగా అభివర్ణించడం మాత్రమే గౌరవం కాదు. ఆమెను ఒక మనిషిగా గుర్తించడం, ఆమె ఆత్మగౌరవాన్ని కాపాడటం, సమాన అవకాశాలు కల్పించడం నిజమైన గౌరవం. తల్లిని గౌరవించడం, సోదరికి స్వేచ్ఛనివ్వడం, భార్య అభిప్రాయాలను గౌరవించడం, సహోద్యోగినికి సమాన అవకాశాలు కల్పించడం.ఇవన్నీ స్త్రీ గౌరవంలో భాగాలే.ఆడపిల్లను గౌరవించాలని చెప్పడంతోపాటు, మగపిల్లవాడికి కూడా స్త్రీ పట్ల గౌరవం, సమానత్వం, బాధ్యత నేర్పించాలి. కుటుంబమే బిడ్డకు తొలి పాఠశాల. తల్లిదండ్రుల ప్రవర్తనే తొలి పాఠం. పాఠశాలలు విద్యతోపాటు మానవీయ విలువలను నేర్పాలి. చట్టాలు నేరస్థులను శిక్షించాలి. సమాజం నేరాలకు దారితీసే మనస్తత్వాలను మార్చడానికి కృషి చేయాలి.పండుగల కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నాం. వీధులను అలంకరిస్తున్నాం. భారీ వేడుకలు నిర్వహిస్తున్నాం. దీపాల కాంతులతో పరిసరాలను ప్రకాశింపజేస్తున్నాం. కానీ, మనసుల్లోని చీకట్లను తొలగించడానికి ఎంత ప్రయత్నిస్తున్నాం? పక్కింటి మనిషి కష్టంలో ఉంటే పలకరించే తీరిక ఉందా? అన్యాయం జరుగుతుంటే ప్రశ్నించే ధైర్యం ఉందా? ఎదుటివారికి సహాయం అవసరమైనప్పుడు మనకు చేతనైనంత అండగా నిలుస్తున్నామా?పండుగల వైభవం పెరగడం తప్పు కాదు.

సంప్రదాయాలను కాపాడుకోవడం కూడా అవసరమే. అయితే, వాటి వెనుక ఉన్న మానవీయ విలువలను విస్మరించకూడదు. పండుగ మనకు ఆనందాన్ని ఇవ్వడంతోపాటు ఆత్మపరిశీలనకు అవకాశం కల్పించాలి. మనలోని చెడును గుర్తించి, మంచి వైపు అడుగులు వేయడానికి ప్రేరణనివ్వాలి.వీధులను వెలిగించే దీపాలకంటే, మనసులను వెలిగించే మానవత్వం గొప్పది. దేవాలయాల్లో చేసే పూజలకంటే, కష్టాల్లో ఉన్న మనిషికి చేసే సహాయం గొప్పది. నోటితో పలికే నీతి వాక్యాలకంటే, ఆచరణలో చూపే మంచితనం గొప్పది. దీపాల వెలుగులో ఇళ్లు ప్రకాశించవచ్చు... కానీ మానవత్వపు వెలుగులోనే సమాజం వికసిస్తుంది.



రామిశెట్టి కావ్య
9390721569

లంకలో రాక్షసుల
చుట్టూ ఉన్నా..
విభీషణుడు వివేకి
అయినాడు
మంథర అయోధ్యలో
ఉన్నా..
దుర్బుద్ధిని
వ్యాపింపజేసింది
చుట్టూ ఎవరు ఉన్నారో
కాదు
నీ లోపల ఏముందనేదే
ముఖ్యం!

నేను ఒంటరినే
నేడు నీవు ఒంటరిగా
చేసే కర్మలే..
రేపు పది మందిలో
చర్చకు వస్తాయి
పైవాడు నీ కర్మల్ని
లెక్కిస్తాడు, డబ్బుల్ని
కాదు!

మనిషి విలువ ముఖం
చూసి చేయకు..
నేడు నవ్వినోడే రేపు
ఏడుస్తాడు సుమా

## పైవాడు లెక్కిస్తున్నాడు

నీ హృదయం మంచిదై..
నీ ఉద్దేశాలు
స్వచ్ఛమైతే..
నీ కర్మలు నిస్వార్థం
ఐతే..
నీ నడక, నడత
ప్రత్యేకమైతే..
నీవు ఎవరినీ కోల్పోలేవు
వారే నిన్ను కోల్పోతారు

మానవత్వ సంపదే
అసలైన విలువ
అది లేని నరుడు
నరకాసుర వారసుడే
నువ్వు నవ్వడం
ప్రధానం కానే కాదు
పదుగురిని
నవ్వించడమే ముఖ్యం!

నీ వారు ఎవరూ అని
అడిగితే..
టైం బాగున్నపుడు
అందరూ నావాళ్లే..
టేం కలిసి రానపుడు



మధుసూదన్ రెడ్డి
9949700037

## శమయతే పాపం...

# వృక్ష ప్రత్యేకత

శమీ శమయతే పాపం, శమీ శత్రు వినాశినీ, అర్జునస్య ధనుర్ధారీ, రామస్య ప్రియదర్శినీ, '...భారత, రామాయణాది పౌరాణిక గాథలలో శమీ వృక్షానికి విశేష ప్రాధాన్యత కల్పించ బడింది. శమీకే "అపరాజిత " అనిపేరు. అంటే ఓటమి నెరుగని మాతయని అర్థం. అమెయే విజయ, నామాంకితయైన జగజ్జనని, అపరాజితా దేవి. విజయానికి అధిదేవత.శరన్నవరాత్రి వేడుకల లో భాగంగా, దుర్గా మాతను తొమ్మిది రోజులుగా కొలిచి నట్లయితే సర్వ శక్తులు సమకూరి, విజయ దశమినాడు విజయం చేకూర గలదని భక్తుల, ఆధ్యాత్మిక కార్యానురక్తుల ప్రగాఢ విశ్వాసం. అందులకై దసరా నవరాత్రి ఉత్సవాలలో ముగింపుగా విజయ దశమి పర్వ దినాన శమీ (జమ్మి) వృక్షాన్ని పూజించి, సర్వాభీష్ట సిద్ధికై ప్రార్థించడం ప్రాచీన కాలంనుండి అనుసరిస్తున్న సత్సాంప్రదాయం. పూర్వకాలంలో రాజులు తమ విజయ యాత్ర సన్నాహక కార్యక్రమాలుగా ' ' అగ్నిపూజ, గుర్రాలు , ఏనుగులు ' ' మొదలైన వాటికి కొన్ని అర్చనలు చేయడాన్ని ఆచరించారు. దానిలో భాగంగానే శమీవృక్ష పూజ చేసి, యుద్ధానికి వెళ్ళేవారు. సంబంధిత కొన్ని విశేషాలను కాళిదాసు రఘువంశ మహా కావ్యమందు నాలుగవ సర్గలో సూచించారు. యజ్ఞ యాగాదులలో ఉపయుక్త శ్రౌతాగ్నిని మధించుటకై , జమ్మికొమ్మ అవసరమైంది. అరనుల లో ఆడుగు కర్ర జమ్మికర్ర. పై కర్ర రావి కర్ర వాడతారు. జమ్మిని స్త్రీ లింగం గా, రావిని పుం లింగంగా ( శమింతా, అశ్వత్థ:) అని ఆర్యులు పేర్కొన్నారు. అగ్ని శమీ గర్భాన కలదని ( శమీ



గర్భా దగ్నిం మంద తి) అని శ్రుతి వచనం, కనుకనే శమీ పూజకు ప్రాధాన్యత ఏర్పడింది. విజయ దశమి నాడు శమీవృక్షాన్ని పూజించే క్రమంలో రామార్జున గాథలను స్మరించే సంప్రదాయం ఉంది. రాముడు , రావణునిపై విజయం సాధించిన దినంగా , పాండవులు వనవాసం వెళుతూ, శమీవృక్షం పైనుండి తమ ఆయుధాలను తిరిగి పొంది కౌరవులను జయించిన దినంగా విజయ దశమికి ప్రత్యేకత ఉంది. అర్జునినితో కూడిన పాండవులు అజ్ఞాత వాసం వెళ్ళే సమయాన తమ అస్త్ర శస్త్రాలను శమీ వృక్షంపై నిక్షేపించినట్లు భారత కథనం. శమీవృక్షం లేదా జమ్మి చెట్టులను మాగ్నోలియో పైటా తరగతికి, ప్రోసో పిస్ జాతికి , ఫాబేసి కుటుంబానికి చెందినది. దీని శా స్త్రీయ నామం ప్రోసోపిస్ సైసిజెరా. వైదిక భాషలో "ఆరణి" అని పిలుస్తారు. అగ్నిని ఉద్భవిం చేందుకు కాష్ఠాంతరంచే మధింప యోగ్యమైన దారువు అని "ఆరణి" ' అర్థం. జమ్మి ఆకుల పసరు తీసి, పుళ్లకు రాస్తే కుష్టు వ్యాధి నశిస్తుందని, జమ్మి పూలను చక్కెరతో కలిపి సేవించడం వల్ల గర్భ స్రావం కాకుండా నిరోధించ బడుతుందని , జమ్మి చెట్టు బెరడు దగ్గు ఆస్తమా వ్యాధులకు ఔషధంగా పని చేస్తుందని ఆయుర్వేద వైద్యులు చెపుతారు. విజయ దశమి సాయంత్రం శమీ వృక్షం వద్ద ఆపరా జితను పూజించి "శమీ శమయతే పాపం శమీ లోహిత కంటకా, ధారిణ్య అర్జున బాణానాం రామస్య ప్రియ వాదినీ , కరిష్యమాణ యాత్రాయాం యథా కాలం సుఖం మయా , తత్ర నిర్విఘ్న కర్తీత్వం భవ శ్రీరామ పూజితే," అని చిట్టీలపై రాని జమ్మి చెట్టు కొమ్మలకు తగిలిస్తే, దీని వల్ల అమ్మవారి కృపతో పాటు శని దోష నివారణ కాగలదని విశ్వాసం. మహారాష్ట్రులు శమీ వృక్షానికి తోడు పలాశ (మోదుగ) పత్ర పూజా చేస్తారు. హిందువుల శుభాశుభ కర్మలలో మోదుగ ప్రమేయం అధికం. ఉపనయనాలో వటువులు భిక్షా సమయాన ధరించేది పలాశ దండం, కాశీకి వెళ్ళి వచ్చిన నైష్టీకులు మోదుగ ఆకుల విస్తళ్ళలో నే భోజనం చేసే వారు. పలా శప త్రాలను పోలిన బంగారు చిన్నచిన్న ఆకులను చేయించి , దేవుళ్కు , స్నేహితులకు , బంధువులకు ఇవ్వడం విజయ దశమినాటి మహారాష్ట్ర ప్రజల ఆచారం.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

# డిజిటల్ వలలో బాల్యం.. బాధ్యత ఎవరిది?

చిన్నారి చేతిలోని తెర ప్రపంచాన్ని పరిచయం చేయాలి; అతడి బాల్యాన్ని మింగేయకూడదు. కానీ చదువు, ఆటలు, నిద్ర, కుటుంబ అనుబంధాల మధ్యకు చొచ్చుకొచ్చిన డిజిటల్ వినియోగం ఇప్పుడు సమాజం ముందున్న తీవ్రమైన సవాలు. పిల్లల దృష్టిని ఎక్కువసేపు బంధించడమే వ్యాపార విజయంగా భావించే వేదికల మధ్య, వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు రక్షణ ఎవరు కల్పించాలి? సాంకేతిక విస్తరణను సంబరంగా జరుపుకుంటున్న దేశం, దాని నీడలో బాల్యం ఎదుర్కొంటున్న ఒత్తిళ్లనూ గుర్తించాలి.అసర్-2024 గ్రామీణ సర్వేలోని గణాంకాలు పరిస్థితిని స్పష్టం చేస్తున్నాయి. 14-16 ఏళ్ల పిల్లల్లో 89.1 శాతం ఇళ్లలో స్మార్ట్‌ఫోన్ అందుబాటులో ఉంది. 82.2 శాతం మందికి దానిని ఉపయోగించడం తెలుసు. ఫోన్ వాడగలవారిలో సర్వేకు ముందువారం విద్యాసంబంధ కార్యకలాపాలకు వినియోగించినవారు 57 శాతం కాగా, సామాజిక మాధ్యమాలకు ఉపయోగించినవారు 76 శాతం. ఈ వినియోగాలు పరస్పరం వేర్వేరు సమూహాలు కావు. అయినప్పటికీ, డిజిటల్ అందుబాటును విద్యాప్రయోజనంగా మార్చడంలో ఉన్న అంతరాన్ని ఇవి తెలియజేస్తున్నాయి.అదే సర్వే ప్రకారం సామాజిక మాధ్యమాలు ఉపయోగించిన పిల్లల్లో అభ్యంతరకరమైన ఖాతాలను బ్లాక్ చేయడం లేదా ఫిర్యాదు చేయడం తెలిసినవారు 62 శాతమే. ఖాతాను ఇతరులకు కనిపించకుండా నియంత్రించడం తెలిసినవారు 55.2 శాతం; పాస్‌వర్డ్ మార్చడం తెలిసినవారు 57.7 శాతం. అంటే తెరను తాకే నైపుణ్యం పెరుగుతున్నా, ప్రమాదాన్ని గుర్తించి తమను తాము రక్షించుకునే పరిజ్ఞానం అందరికీ చేరలేదు. డిజిటల్ అక్షరాస్యతను ఫోన్ ఆపరేట్ చేయగల సామర్థ్యంతో సమానం చేయకూడదు.అంతర్జాతీయ పరిస్థితులూ హెచ్చరిక చేస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2024 నివేదికకు ఆధారమైన 2022 సర్వే ఐరోపా, మధ్య ఆసియా, కెనడాలోని 44 దేశాలు, ప్రాంతాల్లో సుమారు 2.8 లక్షల కౌమారదశ పిల్లలను పరిశీలించింది. సమస్యాత్మక సామాజిక మాధ్యమ వినియోగం 2018లో ఏడు శాతం నుంచి 2022లో 11 శాతానికి పెరిగింది. బాలికల్లో ఇది 13 శాతం, బాలురలో తొమ్మిది శాతం. రోజూ డిజిటల్ ఆటలు ఆడేవారు 34 శాతం; సమస్యాత్మక గేమింగ్ ముప్పులో ఉన్నవారు 12 శాతం. ఇవి భారత గణాంకాలు కావు; మనం ముందస్తుగా స్పందించాల్సిన హెచ్చరికలు.అయితే ప్రతి ఆన్‌లైన్ వినియోగాన్నీ వ్యసనంగా ముద్రవేయడం సరికాదు. నేర్చుకోవడానికి, సృజనాత్మకతకు, స్నేహబంధాలకు సాంకేతికత అవకాశాలిస్తుంది.

సమస్య వినియోగంపై నియంత్రణ కోల్పోయి, నిద్రను, చదువును, రోజువారీ జీవితాన్ని నిర్లక్ష్యం చేసే పరిస్థితిలో ఉంది. అందుకే గంటల లెక్కతోపాటు పిల్లలు ఏం చూస్తున్నారు, ఎందుకు చూస్తున్నారు, తరువాత ఎలా ప్రవర్తిస్తున్నారన్నదీ గమనించాలి. కృత్రిమ మేధ ఇచ్చిన సమాధానాన్ని పరిశీలించకుండా స్వీకరించే అలవాటుకు బదులు, ప్రశ్నించే వివేకాన్ని పెంచాలి.ఈ బాధ్యతను తల్లిదండ్రులపైనే నెట్టేయడం ప్రభుత్వాలు, సాంకేతిక సంస్థలు తప్పించుకోవడమే. పిల్లలకు అనువైన రూపకల్పన, బలమైన గోప్యతా రక్షణ, సులభమైన ఫిర్యాదు వ్యవస్థలను వేదికలు అందించాలి. నిరంతరం చూస్తూనే ఉండేలా ప్రేరేపించే లక్షణాలపై స్వతంత్ర పరిశీలన అవసరం. పాఠశాలల్లో సమాచార నిర్ధారణ, ఆన్‌లైన్ భద్రత, బాధ్యతాయుత వినియోగాన్ని బోధించాలి. ఉపాధ్యాయులకు శిక్షణ, అవసరమైన పిల్లలకు కౌన్సెలింగ్ అందుబాటులో ఉండాలి.పిల్లలకు నిషేధాల జాబితా ఇవ్వడమే పరిష్కారం కాదు. వారి సందేహాలు వినాలి. తప్పు జరిగినప్పుడు భయపడకుండా చెప్పగల విశ్వాసం కల్పించాలి. ఆన్‌లైన్‌లో వేధింపులు ఎదురైతే ఎవరిని సంప్రదించాలో నేర్పాలి. కుటుంబం, పాఠశాల, ప్రభుత్వం, వేదికలు కలిసి పనిచేసినప్పుడే రక్షణ బలపడుతుంది. లాభాల కోసం పిల్లల బలహీనతలను ఉపయోగించుకోవడాన్ని సమాజం సహించకూడదు. బాధ్యతను స్పష్టంగా నిర్ణయించాలి.ఇళ్లలో భోజన సమయాన్ని, నిద్రకు ముందరి వేళలను తెరలకు దూరంగా ఉంచాలి. పెద్దలూ అదే క్రమశిక్షణ పాటించాలి. మైదానాలు, గ్రంథాలయాలు, కళా కార్యక్రమాలకు అవకాశాలు కల్పించకుండా పిల్లలను ఫోన్ వదలమనడం ఫలించదు.

దేశవ్యాప్తంగా పిల్లల డిజిటల్ అలవాట్లపై క్రమబద్ధమైన అధ్యయనాలు జరగాలి. వాటి ఆధారంగా చర్యలు రూపొందించాలి. బాల్యాన్ని కాపాడటం కుటుంబాల వ్యక్తిగత సమస్యగా మిగలకూడదు. పిల్లల సమయమే సంస్థల ఆదాయంగా మారుతున్నప్పుడు, వారి శ్రేయస్సును ప్రజావిధానానికి కేంద్రంగా నిలపాలి. రేపటి పౌరుల ఆలోచనా స్వేచ్ఛను ఈరోజే కాపాడాలి.



సి. హెచ్. ప్రతాప్
77938 00743

# జాతీయం-అంతర్జాతీయం

## అమెరికా అధ్యక్షుడు ఇజ్రాయెల్ శత్రువు: నెతన్యాహు

**ఇజ్రాయెల్ :**

భవిష్యత్తులో అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టే వ్యక్తి ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా వ్యవహరించే అవకాశం ఉందని ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వ్యాఖ్యానించారు. అమెరికా విధానాల్లో మార్పులు చోటుచేసుకునే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, భారత్ వంటి బలమైన దేశాలతో వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.

**లాటిన్ అమెరికా దేశాలతోనూ సంబంధాలను విస్తరించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.**

ఇజ్రాయెల్‌లో అక్టోబర్ 27న జరగనున్న ఎన్నికల నేపథ్యంలో నెతన్యాహు వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. స్థానిక మీడియా కథనాల ప్రకారం ... మరో రెండేళ్లలో ఇజ్రాయెల్ పట్ల శత్రు భావంతో వ్యవహరించే వ్యక్తి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టవచ్చని నెతన్యాహు అభిప్రాయపడ్డారు. ఆ వ్యక్తి పురుషుడైనా, మహిళ అయినా కావచ్చని పేర్కొంటూ..

**అటువంటి పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో అధికారులు ఆలోచించాలని ప్రశ్నించారు.**

అమెరికాతో సంబంధాలను భవిష్యత్తులో ఎలా నిర్వహించాలనే అంశంపై దృష్టి సారించాలని సూచించారు. అమెరికా విధానాల్లో పెద్ద మార్పులు చోటుచేసుకునే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని, డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే ఇజ్రాయెల్ తన వ్యూహాత్మక స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని నెతన్యాహు పేర్కొన్నారు. రాబోయే రెండేళ్లలో అమెరికా సహకారంతో సాధ్యమైనంత ఎక్కువ ప్రయోజనం పొందాలని



అన్నారు. అదే సమయంలో, భవిష్యత్తులో అమెరికా వైఖరిలో మార్పులు వచ్చినా ఇబ్బందులు ఎదురుకాకుండా ఇతర దేశాలతోనూ సంబంధాలను విస్తరించుకోవాలని స్పష్టం చేశారు.

**భారత్ చిన్న దేశమేమీ కాదు ..**

.కొత్త కూటములను ఏర్పాటు చేసుకోవడం, ఇప్పటికే ఉన్న సంబంధాలను మరింత పటిష్ఠం చేసుకోవడం ద్వారా ఇజ్రాయెల్ తన అంతర్జాతీయ ప్రభావాన్ని పెంచుకోవాలని నెతన్యాహు సూచించారు. భారత్ చిన్న దేశమేమీ కాదని వ్యాఖ్యానిస్తూ,

**భారత్ వంటి బలమైన దేశాలతో భాగస్వామ్యానికి ప్రాధాన్యం**

ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. లాటిన్ అమెరికా, బ్రెజిల్ వంటి ప్రాంతాలు, దేశాల్లోనూ త్వరలో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. కూటముల పరిధిని విస్తరించడంతో పాటు, ఇతర దేశాలకు విలువ చేకూర్చగల సామర్థ్యాలను ఇజ్రాయెల్ అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు.

**నెతన్యాహు వ్యాఖ్యలపై ప్రత్యర్థి విమర్శలు**

మరోవైపు .... ఎన్నికలకు ముందు నెతన్యాహు చేసిన వ్యాఖ్యలను ఆయన ప్రధాన ప్రత్యర్థి గాడి ఐసెన్‌కోట్ తప్పుబట్టారు. ఇతర దేశాల పేర్లను ప్రస్తావిస్తూ ప్రజల్లో

**భయాందోళనలు సృష్టించేందుకు నెతన్యాహు ప్రయత్నిస్తున్నారని**

ఆరోపించారు. ఎన్నికల వేళ అంతర్జాతీయ సంబంధాలు, అమెరికాతో భవిష్యత్తు భాగస్వామ్యం వంటి అంశాలు ఇజ్రాయెల్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## కెనడాలో సైనిక శిక్షణా స్థావరంలో ఘోర అగ్నిప్రమాదం

**అల్బెర్టా:**

కెనడాలోని అల్బెర్టా ప్రావిన్స్‌లో ఉన్న సైనిక శిక్షణా స్థావరంలో సంభవించిన ఘోర అగ్నిప్రమాదంలో నలుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. మరో 39 మంది గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో 19 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. కెనడియన్ ఫోర్సెస్ బేస్ వైన్రైట్‌లో సైనికులు లైవ్ మందుగుండు సామగ్రితో యుద్ధ శిక్షణ నిర్వహిస్తున్న సమయంలో శిక్షణా ప్రాంతంలోని గడ్డి మైదానంలో మంటలు చెలరేగాయి. గంటకు 96 కిలోమీటర్ల వేగంతో వీచిన బలమైన గాలుల కారణంగా మంటలు అత్యంత వేగంగా వ్యాపించాయి. కేవలం 30 నుంచి 60 సెకన్ల వ్యవధిలోనే మంటలు సుమారు



కిలోమీటరు మేర విస్తరించడంతో సైనికులు ప్రమాదంలో చిక్కుకున్నారు. ప్రధాని మార్క్ కార్నీ దిగ్భ్రాంతిఈ దుర్ఘటనపై కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శాంతికాలంలో కెనడా గడ్డపై సాయుధ దళాలు ఎదుర్కొన్న అత్యంత విషాదకర ఘటనల్లో ఇదొకటిగా ఆయన అభివర్ణించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపట్టారు.

## తమిళనాడులో భారీ వర్షాలు చెన్నైకి రెడ్ అలర్ట్

**తమిళనాడు :**

తమిళనాడును భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. భారీ వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. శనివారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు చెన్నైతోపాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాతావరణ శాఖ చెన్నై, తిరుచిరాపల్లి, కోయంబత్తూరు, నీలగిరి జిల్లాలకు సోమవారం 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. ఈ నాలుగు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు హెచ్చరించారు.

**రాష్ట్రంలోని ఉత్తర, పశ్చిమ, మధ్య, దక్షిణ ప్రాంతాల్లో**

వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండనుంది. ధర్మపురి, కృష్ణగిరి, సేలం, తిరువళ్లూరు, దిండిగల్, తేని, విరుదునగర్, తెన్కాశి, తిరునెల్వేలి, కన్యాకుమారి, తూత్తుకుడి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది.



వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు రావొద్దన్నారు.

**వర్షపాతం వివరాలు ....**

ప్యారిస్ 36 సెం.మీ, కత్తివాక్కం 34, చెన్నై సెంట్రల్ 27, సాత్తాంకాడు 26, తిరువొట్రియూర్, ఎన్నూర్ 22, ఎంజీఆర్ నగర్ 19,

**సీడీ ఆస్పత్రి తండయార్‌పేట, పెరంబూర్ 18, తండయార్‌పేట 17,**

వడపళని, చెన్నై కలెక్టరు కార్యాలయం 16, బేసిన్‌బ్రిడ్జ్, నుంగంబాక్కం, వైఎంసీఏ నందనం,

**ఆలందూర్ 15, ఐస్‌హౌస్, అన్నా వర్సిటీ, సెమ్మేడు (విళుపురం) 14,**

వాలాజా (రాణిపేట), మీనంబాక్కం, మాధవరం 1 సెం.మీ, మణలి, మడిప్పాక్కం, మణలి న్యూటౌన్, సాలిగ్రామం, వలసరవాక్కం, రెడ్‌హిల్స్, మనంపూండి (విళుపురం), గుమ్మిడిపూండి, మరక్కానం (విళుపురం) 12 సెం.మీ వర్షపాతం నమోదైంది.

## మళ్లీ అదృష్టాన్ని పరీక్షించుకుంటారా?

**ఇరాన్**

మళ్లీ దాడులు చేయడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు రహస్య చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇరాన్ పని పూర్తి చేస్తామంటూ ట్రంప్ తాజాగా హెచ్చరికలు జారీ చేశారు. ఈ క్రమంలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో ఇరుదేశాలు తమపై దాడి చేసినప్పుడు టెహ్రాన్ సమర్థంగా పోరాడి, తానేంటో నిరూపించుకుందన్నారు. ఇప్పుడు మరోసారి మా పని పూర్తి చేస్తామని అనుకుంటే మరింత బలంగా కలబడతామన్నారు. 'అమెరికా, ఇజ్రాయెల్ మీ అదృష్టాన్ని ఇంకోసారి పరీక్షించుకోవాలనుకుంటున్నారా? అయితే ప్రయత్నించండి. కానీ, జాగ్రత్త. మాకు కూడా పూర్తికాని పనులు చాలా ఉన్నాయి' అని అరాగ్చీ హెచ్చరించారు. స్వదేశంలో చట్టపరమైన పరిణామాలను తప్పించుకోవడానికి నెతన్యాహు అమెరికాను మరో సైనిక ఘర్షణలోకి లాగడానికి ప్రయత్నిస్తున్నారని ఇరాన్ మంత్రి ఆరోపించారు. ఆయన జైలు జీవితాన్ని తప్పించుకోవడానికి ట్రంప్‌ను వాడుకుంటున్నారన్నారు. ఈ చర్యల పర్యవసానాలను ఇజ్రాయెల్‌తో పాటు, అగ్రరాజ్యం కూడా ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. టెల్ అవీవ్‌వియన్నా విమానానికి బాంబు



బెదిరింపు.. అత్యవసర ల్యాండింగ్‌నెతన్యాహును కాకుండా వేరే వారిని ఎన్నుకోవద్దు: ఇజ్రాయెలీలకు ట్రంప్ హెచ్చరికఅక్టోబర్ 27న జరగనున్న ఇజ్రాయెల్ పార్లమెంటరీ ఎన్నికలకు ముందు నెతన్యాహుపై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. ఆయన ఇరాన్‌తో ఘర్షణను సమర్థంగా ఎదుర్కొని, ఇజ్రాయెల్‌లో శాంతిని నెలకొల్పారన్నారు. మరోసారి ప్రధానిగా ఆయన ఎన్నికకు తాను మద్దతిస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో దేశానికి వేరే నాయకుడిని ఎన్నుకోవద్దని ఇజ్రాయెల్ ప్రజలను హెచ్చరించారు. ఒకవేళ వారు తప్పుడు నేతను ఎన్నుకుంటే అమెరికా జోక్యం చేసుకోవాల్సి వస్తుందన్నారు. దశాబ్దాలుగా ఇజ్రాయెల్, అమెరికాలకు ఇరాన్ ముప్పుగా పరిణమిస్తోందని ఆరోపించారు. నెతన్యాహు లేకపోతే టెహ్రాన్ ఇజ్రాయెల్‌ను నాశనం చేస్తుందన్నారు. ఇప్పటికైనా ఆ దేశం తన పంథాను మార్చుకోకపోతే త్వరలోనే దాని పని పూర్తి చేస్తామని హెచ్చరించారు.

## బుక్‌స్టాల్స్ పైకి బుల్డోజర్లు

**కోల్‌కతా :**

పశ్చిమ బెంగాల్‌లో బిజెపి ప్రభుత్వం బరి తెగించింది. తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని దసరా ఉత్సవాల సందర్భంగా దుర్గా దేవి మండపాల వద్ద సిపిఎం, వామపక్షాలు దశాబ్దాలుగా ఏర్పాటు చేస్తున్న బుక్ స్టాల్స్‌ను కూల్చివేస్తోంది. బలవంతంగా ఖాళీ చేయిస్తోంది. బెంగాల్‌లో దసరా నవరాత్రుల సందర్భంగా సిపిఎం ఏర్పాటు చేసిన పుస్తకాల దుకాణాలను కూల్చివేయడానికి బుల్డోజర్లును, పోలీసులను బిజెపి ప్రభుత్వం వినియోగించింది. ప్రతీ ఏటా దుర్గా పూజ కోసం ఏర్పాటు చేసిన మండపాల వద్ద ప్రజల విజ్ఞానం, వికాసం కోసం సిపిఎం నేతృత్వంలో వామపక్షాలు బుక్‌స్టాల్స్‌ను ఏర్పాటు చేయడం కొన్ని ఏళ్ల నుంచి కొనసాగుతోంది. వీటికి ప్రజల నుంచి కూడా మంచి ఆదరణ ఉంటుంది. అయితే ఈ ఏడాది వీటిని అడ్డుకోవడానికి బిజెపి ప్రభుత్వం నిరకుశంగా వ్యవహరించింది. నిజానికి ఈ ఏడాది దసరాలు ఉత్సవాలు ప్రారంభమైన దగ్గర నుంచి ఏర్పాటు చేసిన సిపిఎం బుక్‌స్టాల్స్‌పై బిజెపి గుండాలు దాడులు చేస్తున్నారు. స్టాల్స్‌ను ధ్వంసం చేయడంతో పాటు సిపిఎం కార్యకర్తలపై భౌతికంగా దాడులకు దిగుతున్నారు. వీటిని సిపిఎం కార్యకర్తలు ప్రతిఘటిస్తున్నారు. స్టాల్స్‌ను మళ్లీ ఏర్పాటు చేస్తున్నారు. అయితే కొల్‌కతాలో చోర్‌బగాన్ సర్బజనీన్ (సర్వజనీన) దుర్గా మండపంవద్ద శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాట తరువాత సిపిఎం బుక్‌స్టాల్స్‌పై ఏకంగా పోలీసులు, పౌర అధికారులు దాడులకు దిగారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని స్టాల్స్‌ను ఖాళీ చేయించారు. స్టాల్స్‌ను తొలగించడానికి కొల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు బుల్డోజర్లతో వచ్చారు. వాటిని ధ్వంసం చేశారు. పోలీసులు వామపక్ష పార్టీలు స్టాళ్లను ధ్వంసం చేసి, తగలబెట్టి, తొలగించారు. అయితే సంఘ్ పరివార్, బిజెపి నడుపుతున్న బుక్‌స్టాల్స్ జోలికి మాత్రం అధికారులు వెళ్లడం లేదు. సిపిఎం బుక్ స్టాళ్లను తొలగించడానికి కొల్‌కతా హైకోర్టు ఇచ్చిన ఒక సంకుచిత ఉత్తర్వును బిజెపి ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నారని సిపిఎం నాయకులు విమర్శిస్తున్నారు. సిపిఎం బెంగాల్ రాష్ట్ర కమిటీ సభ్యులు సుదీప్ సేన్‌గుప్తా మాట్లాడుతూ 'మాకు పోలీసులు, కార్పొరేషన్ నుండి, అలాగే



స్టాల్‌లో వినియోగించే విద్యుత్‌కు అనుమతి ఉంది. కానీ బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారు' అని తెలిపారు. హైకోర్టుకు దసరా సెలవులు ఇచ్చిన తర్వాత స్టాల్స్‌ను ఖాళీ చేయడానికి అధికారులు, పోలీసులు వచ్చారని విమర్శించారు.లెఫ్ట్ ఫ్రంట్ సీనియర్ నాయకుడు బిమన్ బసు మాట్లాడుతూ దసరా ఉత్సవాల సందర్భంగా బుక్‌స్టాల్స్‌ను ఏర్పాటు చేసే సంప్రదాయం డెబ్బై ఏళ్లకు పైగా కొనసాగుతోందని అన్నారు. "1952లో కొల్‌కతాలో మూడు పుస్తకాల స్టాళ్లతో ప్రగతిశీల మార్క్సిస్ట్ పుస్తకాల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత ఇది విపరీతంగా పెరిగింది, ఎందుకంటే ప్రజలు పుస్తకాలు కొంటారు" అని తెలిపారు. సిపిఎం (మార్క్సిస్ట్‌లెనినిస్ట్) లిబరేషన్ కూడా బిజెపి ప్రభుత్వ చర్యను విమర్శించింది. వామపక్షాలు నడుపుతున్న పుస్తకాల దుకాణాలను బిజెపి, ఆర్ఎస్ఎస్ లక్ష్యంగా చేసుకున్నాయని, ఎందుకంటే వారు పుస్తకాలను చూసి భయపడుతున్నారని విమర్శించింది.

## నా మాట తీరు తప్పే: వాన్స్

**వాషింగ్టన్:**

హెచ్ 1బీ వీసాలపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన వ్యాఖ్యలను సమర్థించుకుంటూనే.. తన మాటతీరు సరిగా లేదని అంగీకరించారు.

**విదేశీ నిపుణులను 'వెట్టి చాకిరీ చేసేవారు'గా అభివర్ణించడంపై వివరణ ఇచ్చారు.**

తన విమర్శలు వీసాదారులపై కాదని, వారిని యజమానులపై ఆధారపడేలా చేస్తున్న వీసా విధానంపై అని స్పష్టం చేశారు. హెచ్ 1బీ వీసాపై అమెరికాకు వచ్చే ఉద్యోగుల వీసా వారి నివాసానికి ప్రధాన ఆధారమవుతోందని, ఉద్యోగం కోల్పోతే స్వదేశానికి తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని చెప్పారు.

తన వ్యాఖ్యలు.

**ఎవరినైనా కించపరిచి ఉంటే అది తన మాటతీరులోని లోపమేనని అంగీకరించారు.**

తన భార్య ఉషా వాన్స్..

**దక్షిణ భారతదేశం నుంచి వలస వచ్చిన తల్లిదండ్రుల కుమార్తె అని గుర్తు చేశారు.**

**వలసదారులను**

అమానవీయంగా చూడటం తన ఉద్దేశం కాదని పేర్కొన్నారు.



## పాలక విధానాలపై 'ప్రపంచ' ప్రజా పోరుబాట

**పారిస్/బ్రస్సెల్స్/లిస్బన్ :**

ప్రపంచంలోని పలు దేశాల్లో ఇటీవల భారీ నిరసనలు చెలరేగాయి. ఫ్రాన్స్ నుంచి అర్జెంటీనా వరకు ఈ ఆందోళనల వెనుక దాదాపు ప్రతి దేశంలో కనిపించే సమస్యలు ఇళ్ల ధరలు, ద్రవ్యోల్బణం, ప్రజా సేవలకు నిధుల కోత, ప్రభుత్వ వ్యతిరేకత. వీటిలో ఫ్రాన్స్, అల్బేనియాలు ప్రభుత్వ విధానాలపై అత్యంత తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. శనివారం నాడు ఫ్రాన్స్ అంతటా లక్షల మంది వీధుల్లోకి వచ్చారు. పెరిగిన ధరలు, క్షీణిస్తున్న ప్రభుత్వ సేవలు, శిథిలావస్థలోని పాఠశాలలు, విద్యా నిధుల కోతలపై ఈ ప్రదర్శనలు జరిగాయి.

**ఉద్యమం ఎలా మొదలైందంటే..** గత నెల పారిస్ ఉత్తర శివార్లలోని పేద ప్రాంతాల్లోని ఉన్నత పాఠశాలల్లో ఈ ఉద్యమం మొదలైంది. ఉపాధ్యాయుల కొరత, శిథిలమైన భవనాలపై కోపం క్రమంగా అసమానత, ప్రజా వ్యయం, జీవన ప్రమాణాలపై విస్తృత ఉద్యమంగా మారింది. పాఠశాలల్లో నిరసనలు మొదట స్థానికంగా మొదలై తరగతులు స్తంభించాయి. ఆ తర్వాత ఇంధన ధరలు, జీవన వ్యయంపై భారీ ఆందోళనగా రూపుదాల్చాయి. 2018 నాటి "గిలెట్స్ జోన్"(ఎల్లో వెస్ట్) ఉద్యమాన్ని పునరుద్ధరించాలని సామాజిక మాధ్యమాల్లో వచ్చిన పిలుపులు శనివారం మరింత మందిని వీధుల్లోకి తెచ్చాయి. అప్పట్లో ఇంధన పన్నుల పెంపుపై మాక్రాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ ఉద్యమం జరిగింది. కొందరు ప్రదర్శకులు హైవిజిబిలిటీ జాకెట్లు ధరించి రోడ్లను అడ్డుకున్నారు. కార్మిక సంఘాలు కూడా ఈ ఆందోళనలకు మద్దతిస్తూ అధిక వేతనాలు, పింఛన్లు, తక్కువ ధరలును డిమాండ్ చేసింది. "జీవన వ్యయం మరీ భారంగా ఉంది, అందుకే పోరాడుతున్నాం" అని పారిస్‌లో 19 ఏళ్ల నిరసనకారిణి లోలా చెప్పారు. ఇంధన ధరలు ఎక్కువగా ఉన్నాయని, ఎక్కువ మంది ఉపాధ్యాయులను అడిగినందుకు విద్యార్థులపై దాడులు జరుగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. అక్టోబర్‌లో 2 వేల మందిపై జరిపిన సర్వేలో 45 శాతం మంది ధరల పెరుగుదల,

**ద్రవ్యోల్బణంపై ఆందోళన చెందుతున్నట్లు తేలింది.**

ప్రభుత్వ రుణాన్ని తగ్గించే ప్రయత్నాలు పెట్టుబడిదారుల కోసమేనని, ప్రభుత్వ రుణ వ్యయాలు రెండు దశాబ్దాలలో అత్యధిక స్థాయికి చేరాయని పలువురు నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ఘటనలు అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్‌పై ఒత్తిడిని పెంచాయి. నిబంధనల ప్రకారం ఆయన మళ్లీ పోటీ చేయలేరు. ఆరు నెలల్లో ఆయన వారసుడి కోసం ఎన్నికలు జరగనున్నాయి. హింసకు పాల్పడినవారిని విచారించి శిక్షిస్తామని, "గందరగోళాన్ని విత్తేవారికి" వ్యతిరేకంగా దేశం ఐక్యంగా నిలుస్తుందని ఆయన ఆదివారం చెప్పుకొచ్చారు. అయితే. ఫ్రాన్స్ "మూడో ప్రపంచాన్ని దిగుమతి చేసుకుంది" అని అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ వలసలను నిందించారు.




ఫ్రాన్స్ విద్యార్థి ఉద్యమంలో స్వీడన్ పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్ కూడా పాల్గొని సంఘీభావం తెలిపారు.**ఇతర యూరప్ దేశాల్లోనూ ఆందోళనలు**బెల్జియం: ఇంటి ఖర్చులు పెరగడం, ప్రజా వ్యయంలో కోతల నేపథ్యంలో విద్యార్థులు ఉన్నత విద్య, విశ్వవిద్యాలయ రిజిస్ట్రేషన్ రుసుముల పెంపును వ్యతిరేకిస్తున్నారు.

**ఇది బెల్జియం అంతటా జీవన వ్యయ నిరసనగా విస్తరించింది.**

బ్రస్సెల్స్, లీజ్ నగరాల్లో పోలీసులతో ఘర్షణలు జరిగాయి. పోలీసులు బాష్పవాయువు, వాటర్ కెనాన్లు ప్రయోగించారు. లీజ్‌లో 45 మందిని అరెస్టు చేశారు. ఇది "సమాజాన్ని అస్థిరపరిచేందుకు సంఘటితంగా, పునరావృతంగా చేస్తున్న స్వచ్ఛమైన హింస" అని అంతర్గత మంత్రి బెర్నార్డ్ క్వింటిన్ ఆందోళనకారులను విమర్శించారు.

**ఇటలీ : పెరుగుతున్న జీవన వ్యయం, తగ్గుతున్న కొనుగోలు శక్తికి నిరసనగా మిలాన్‌లో జరిగిన ప్రదర్శన అదుపు తప్పింది.**

స్తబ్దుగా ఉన్న వేతనాలు, ద్రవ్యోల్బణం, రోజువారీ ఖర్చులు భరించడంలో ఇబ్బందులపై ఈ నిరసన జరిగింది. కేథడ్రల్ ఎదుటి చౌరస్తాను ఖాళీ చేయించేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. ట్యూరిన్‌లో కూడా ఘర్షణలు జరిగాయి. బొలోన్యాలో పోలీసులు వాటర్ కెనాన్ ప్రయోగించి ఏడుగురిని అరెస్టు చేశారని ఆ దేశ మీడియా నివేదించింది.పోర్చుగల్ : పెరుగుతున్న జీవన వ్యయం, తక్కువ వేతనాలు, అందుబాటు ధరల్లో ఇళ్లు దొరకకపోవడంపై లిస్బన్‌లో వేలాది మంది కవాతు చేశారు. లిస్బన్ సహా అనేక నగరాల్లో 2017 నుంచి ఆస్తి ధరలు రెట్టింపుకు మించి పెరిగాయి. కొత్త లీజుల అద్దెలు కూడా దాదాపు అంతే పెరిగాయి. ఇది యువ ఉద్యోగులు,

**తక్కువ ఆదాయ కుటుంబాలపై భారం మోపింది.**

ఇల్లు కొనలేకపోవడమే కాక, అద్దెకు ఉండటం కూడా భరించలేనిదిగా మారిందని చాలామంది భావిస్తున్నారు.

**అల్బేనియా: విశ్వవిద్యాలయాల దుస్థితి, అధిక విద్యా వ్యయం, ఆర్థిక సహాయం లేకపోవడం,**

గ్రాడ్యుయేషన్ తర్వాత ఉపాధి అవకాశాల కొరతపై విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. గత వారం టిరానాలో విద్యా మంత్రిత్వ శాఖ భవనం వద్ద ఆందోళన హింసాత్మకంగా మారింది.పోలీసులుద్యోగం, ధనికపేద అంతరంపై ఆందోళనల తో డిమాండ్లు విస్తరించాయి. ఐదో రోజు ఆందోళనల్లో ప్రధాని ఎడి రామా రాజీనామా చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. పోలీసులు రబ్బరు బుల్లెట్లు ప్రయోగించారు. అవినీతి, విద్య, ఉపాధి అంశాలకూ యువత పోరాడుతుంది.

**అమెరికా: "నో కింగ్స్- ఓట్ ఎర్లీ"**

అమెరికాలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను వ్యతిరేకించే "నో కింగ్స్" నెట్‌వర్క్ దేశవ్యాప్తంగా నగరాల్లో, సమాజాల్లో ర్యాలీలు నిర్వహించింది. మధ్యంతర ఎన్నికల్లో ముందస్తు ఓటింగ్, ఓటర్ల హాజరు, ఎన్నికల రక్షణపై దృష్టి పెడుతూ "నో కింగ్స్: వోట్ ఎర్లీ" పేరుతో ఈ కార్యక్రమం జరిగింది. వాషింగ్టన్ డి.సి.లో లింకన్ మెమోరియల్ మెట్ల వద్ద భారీ గాలితో నింపిన గాడిద బొమ్మ, ట్రంప్ తల ఆకారపు పేపర్ మాషే బొమ్మ, "ముందస్తుగా ఓటు వేయండి" అనే బోర్డులతో నిరసన తెలిపారు. వాషింగ్టన్ రాష్ట్రంలోని ఎవరెట్‌లో "ప్రజాస్వామ్యం కోసం సంగీత కచేరీ"ని నిర్వహించారు. మిన్నియాపోలిస్‌లో వేలాది మంది సమీకరించారు.

## విషాదానికి కారణం: నిర్లక్ష్యపు నిర్వహణ!

**కొల్‌కతా :**

పశ్చిమ బెంగాల్ రాజధాని కొల్‌కతాలోని చార్‌బగాన్ సర్వజనీన్ దుర్గా మండపం వద్ద శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటనకు నిర్లక్ష్యం, నిర్వహణాలోపాలే ప్రధాన కారణమని పోలీసులు ఆదివారం ప్రకటించారు. ఈ కేసులో ఏడుగురిని అరెస్టు చేవారు. మరోవైపు మృతుల సంఖ్య 19 కి చేరింది. ఇంకా 25 మంది క్షతగాత్రులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పూజా నిర్వాహకుల నిర్లక్ష్యానికి సంబంధించిన ఆధారాలు ఉన్నాయని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. భారీ వర్షం తర్వాత జన సమూహాన్ని నియంత్రించడంలో దుర్గా పూజ మండపం నిర్వాహకులు విఫలమయ్యారని, అలాగే తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేయడం వంటివి సందర్శకులలో భయాందోళనలను రేకెత్తించాయని, అందువల్లే తొక్కిసలాట జరిగిందని ఆ అధికారి పేర్కొన్నారు. పూజా నిర్వాహకుల ఘోరమైన నిర్లక్ష్యానికి సంబంధించి తాము తగినన్ని ఆధారాలు సేకరించామని చెప్పారు. సిసిటివి కెమెరా ఫుటేజీని సేకరించి, స్థానికులు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను రికార్డు చేసి ఈ విషయాన్ని నిర్ధరించుకున్నామని వెల్లడించారు.

**సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్ర దిగ్భ్రాంతి**

న్యూఢిల్లీ : కొల్‌కతాలోని చార్‌బగన్ దుర్గామండపం వద్ద జరిగిన తొక్కిసలాటలో 19 మంది ప్రాణాలు కోల్పోవడంపై భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పొలిట్‌బ్యూరో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. బాధితుల కుటుంబ సభ్యులకు



ప్రగాఢ సానుభూతి తెలియజేసింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండే కొల్‌కతా వైద్య కళాశాల ఆసుపత్రికి కాకుండా ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించడాన్ని సిపిఎం ఆక్షేపించింది. ప్రయివేటు ఆసుపత్రికి ప్రచారకార్యకర్తగా బిజెపి ప్రభుత్వ వ్యవహరించడం సిగ్గు చేటు అని,

**ఇప్పుడు బాధితులకు ఎంతటి సానుభూతి ప్రకటించినా..లేదా పరిహారం అందించాని ఆ నష్టాన్ని భర్తీ చేయలేరని పేర్కొంది.**

దుర్గమ్మ మండపాల వద్ద సందర్శకుల భద్రతను పటిష్ఠం చేయడానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయకుండా..ఆ మండపాల పూజా కమిటీలను గుప్పిట్లో పెట్టుకోవడానికి రాష్ట్రంలోని బిజెపి గలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. కాగా శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా నగరంలో మండపాలకు సమీపంలో పుస్తకాల దుకాణాలు ఏర్పాటు చేయడం విక్రయించడం కొల్‌కతా సంస్కృతిలో సాంప్రదాయంగా వస్తోంది.బిజెపి పాలకులు ఇప్పుడు ఆ పుస్తకాల దుకాణాలను కూడా కూల్చివేసి దుర్మార్గం చాటారు. ఈ చర్యలను కూడా సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది.

సాధారణంగా సుదూర ప్రాంతాల నుండి మండపాల సందర్శనకు వచ్చే ప్రజల భద్రతకు ఏర్పాట్లు చేసి అక్కడే మోహరించాల్సిన పోలీసులు ఆ పని చేయకుండా ప్రగతిశీల పుస్తకాల దుకాణాలను అడ్డుకకోవడంలోనూ, కూల్చివేసే చర్యల్లోనూ నిమగ్నమవ్వడం దుర్మార్గమని తెలిపింది. అంతేకాదు పౌర సమాజాలు, విపత్తు నివారణ సహాయక బృందాలతో కలిసి ప్రజలకు సేవలందించాల్సిన పోలీసులు..

**పాలక పెద్దలకు, వివిఐపిలకు, వారి అనుచరుల సేవలో తరిస్తున్నారని**

విమర్శించింది. ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను బాధ్యులుగా చేయాలని, జవాబుదారీతనం నెలకొల్పడానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది.

**నిర్వాహక కమిటీలోకి చొరబడ్డ అధికారిక పెద్దలు**సాధారణంగా దుర్గా మండపాల వద్ద పూజా నిర్వాహకులు ప్రతి మండపాన్ని ప్రత్యేక కాన్సెప్టుతోనూ, థీమ్‌తో రూపొందిస్తారు. ఇందుకు సంబంధించిన వనరులను సమీకరించి.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ – ఉమ్మడి జిల్లాల వార్తలు

## జిల్లా ప్రజలందరికీ విజయదశమి పండుగల శుభాకాంక్షలు




**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**
**జయశంకర్ భూపాలపల్లి**
**అక్టోబర్ 19(వుదయం జిల్లా ప్రతినిధి) :**

సంస్కృతి, సంప్రదాయాలు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకలుగా నిలిచే బతుకమ్మ, విజయదశమి (దసరా) పండుగలను పురస్కరించుకుని జిల్లా ప్రజలందరికీ సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకృతిలో సహజంగా లభించే వివిధ రకాల రంగు రంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, మహిళలు, యువతులు, బాలికలు తొమ్మిది రోజుల పాటు సంప్రదాయబద్ధంగా ఆటపాటలతో బతుకమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించుకోవడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, సామూహిక ఐక్యతను చాటిచెప్పే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. విజయదశమి పర్వదినం జిల్లా ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతిసౌభాగ్యాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు నింపాలని ఆకాంక్షించారు. దసరా పండుగ ప్రతి ఒక్కరిలో నూతనోత్సాహాన్ని నింపడంతో పాటు మరిన్ని విజయాలు సాధించేందుకు దోహదపడాలని కలెక్టర్ ఆకాంక్షించారు.జిల్లా ప్రజలందరూ బతుకమ్మ, విజయదశమి పండుగలను సంప్రదాయబద్ధంగా,భక్తిశ్రద్ధలతో,ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు.

## బీబీనగర్–ఆలేరు జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయం**
**యాదాద్రి భువనగిరి జిల్లా,అక్టోబర్19( వుదయం ప్రతినిధి) :**



జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి బీబీనగర్ నుండి ఆలేరు వరకు ఉన్న బ్లాక్ స్పాట్లను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బీబీనగర్ నుంచి ఆలేరు వరకు జాతీయ రహదారిపై తరచుగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్న బ్లాక్ స్పాట్లను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో,రెవెన్యూ అదనపు కలెక్టర్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ...ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు సంభవించడానికి గల కారణాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. రహదారి పరిస్థితులు, ప్రమాదాలకు దారితీస్తున్న ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకొని, భవిష్యత్తులో ప్రమాదాలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన నివారణ చర్యలపై సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.జిల్లా పోలీసు యంత్రాంగం, నేషనల్ హైవే అథారిటీ, రోడ్ సేఫ్టీ కమిటీ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రమాదకర ప్రాంతాల్లో అవసరమైన రహదారి భద్రతా చర్యలను గుర్తించాలని , వాహనదారులకు ప్రమాదాలపై ముందస్తు అవగాహన కల్పించడం, ప్రమాదాల తీవ్రతను తగ్గించే ప్రత్యామ్నాయ చర్యలను గుర్తించడం, అవసరమైన రహదారి భద్రతా ఏర్పాట్లపై దృష్టి సారించాలని సూచించారు. జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ లక్ష్మీ నారాయణ,సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనగర్ కాలనీలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



**లంబోదర యూత్ ఆధ్వర్యంలో సందడిగా పండుగ సంబరాలు**
**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి**
**అక్టోబర్ 19**

నల్గొండ పట్టణ కేంద్రంలో శ్రీనగర్ కాలనీ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు నల్గొండ పట్టణంలోని శ్రీ నగర్ కాలనీ 19వ డివిజన్‌లో లంబోదర యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచులు ప్రకృతిని పూజిస్తూ, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి భక్తిశ్రద్ధలతో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి,

బతుకమ్మల చుట్టూ చేరి బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. పూలతో అలంకరించిన బతుకమ్మలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు మహిళల్లో ఐక్యత, సోదరభావం పెంపొందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని పలువురు పేర్కొన్నారు. లంబోదర యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు కాలనీలో పండుగ వాతావరణాన్ని నింపాయి. యువత సంప్రదాయ పండుగల నిర్వహణలో ముందుండటం అభినందనీయమని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో జరుపుకోవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు మదన్ అరవిందు సతీష్ కృష్ణరాజు పవన్ శివ చరణ్ వెంకటరాజు తసిక్ కాలనీ ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## ప్రజల జీవితాల్లో విజయదశమి వెలుగులు నింపాలి

**రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు**
**మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**
**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి**
**అక్టోబరు 19:**



రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి విజయదశమి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ఈ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని మంత్రి కోరారు. కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ఐకమత్యంతో పండుగలను జరుపుకోవాలని సూచించారు. రైతులు, కార్మికులు, యువత, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలకు విజయదశమి శుభాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. పరస్పర ప్రేమాభిమానాలు, సోదరభావం, మానవతా విలువలను పెంపొందించుకుంటూ పండుగను జరుపుకోవాలని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలని, ప్రజల ఆశయాలు నెరవేరాలని ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తోందని తెలిపారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా ఆయుధ వాహన పూజలు

**జయశంకర్ భూపాలపల్లి**
**అక్టోబర్ 19(వుదయం జిల్లా ప్రతినిధి)**



విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని భూపాలపల్లి జిల్లా పోలీస్ హెడ్ కోటర్స్ లో ఆయుధ పూజలు, వాహన పూజలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆర్మ్డ్ రిజర్వ్ విభాగంలో ఆయుధాలకు, (ఎం.టి.) విభాగంలో పోలీస్ వాహనాలకు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విజయదశమి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, ఈ పర్వదినం ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు,

శాంతి సౌభాగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పండుగను ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు.ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణతో పాటు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, అత్యవసర సమయాల్లో సత్వర సేవలందించడంలో ఆయుధాలు, పోలీస్ వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు.ప్రజల సహకారంతో జిల్లాలో శాంతిభద్రతలను పటిష్టంగా కొనసాగిస్తూ, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమర్థవంతమైన పోలీస్ సేవలు అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు

కూడా విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్‌కుమార్, ఎస్బీ సీఐ నరేష్, భూపాలపల్లి టౌన్ సీఐ శ్రీనివాస్, ఆర్ఐలు సంతోష్, రత్నం, పూర్ణచందర్‌తో పాటు పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మలకు దసరా శుభాకాంక్షలు





**సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి**
**దమ్మపేట అక్టోబర్ 19**
**(వుదయం ప్రతినిధి):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేసిన సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమై నా నియోజకవర్గంలో,రైతులకు సకాలంలో నీళ్లు అందించి పంటలు ఎండిపోకుండా కాపాడినందుకు మీకు ప్రత్యేక ధన్యవాదాలు సార్ ఎమ్మెల్యే. మా నియోజకవర్గంలో రైతులు మీ దయతో చాలా సంతోషంగా ఉన్నారు సార్ ఎమ్మెల్యే. ఏలినో ఎంత ప్రభావం ఉన్న మీ దయతో మా చెరువులు నిండుగా ఉన్నాయి ఎమ్మెల్యే తుమ్మల కు ఆమె ప్రత్యేక అభినందనలు తెలియజేశారు

అదేవిధంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన రైతులు తుమ్మలను కలిసి జిల్లాలో ఉన్న సమస్యలు సాగునీరు తాగునీటి కష్టాల గురించి వివరించి మీరు మాకు అందించిన సీతారామ వల్ల మా పంటలు పండుతున్నాయి మీకు ఉన్న ముందు చూపు ఆలోచనతో రైతులు చాలా సంతోషంగా ఉన్నారు. మీలాంటి నాయకుడు మా ఖమ్మం జిల్లాలో ఉండటం మాకు చాలా గర్వంగా ఆనందంగా ఉంది అని ఉమ్మడి జిల్లా రైతులు తుమ్మల గారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అశ్వరావుపేట మండలం మారుమూల ప్రాంతమైనఉసర్లగూడెం మహిళలు మంత్రిని కలిసి వారి సమస్యలు చెప్పుకున్నారు త్వరలో మీ ఊరు వచ్చి మీకున్న సమస్యను సకాలంలో తీరుస్తాను అని వారికి హామీ ఇచ్చారు. అలానే ఒక నిరుపేద వికలాంగుడు పెన్షన్ కోసం తుమ్మల అడగగా ఇతను పూర్తిగా వికలాంగుడు ఇతనికి పెన్షన్ ఎందుకు రావడం లేదు అని సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయిని పిలిచి ఇతనికి త్వరగా పెన్షన్ ఇప్పించాలని తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి నాయకులు కార్యకర్తలు దసరా శుభాకాంక్షలు తెలియజేయడానికి రావడంతో తుమ్మల నివాసం జన సంద్రంతో నిండిపోయింది.

## ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

**క్షేత్రస్థాయిలో రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి.**
**వ్యవసాయ, ఉద్యానవన, నీటి పారుదల, విద్యుత్, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.**
**మహబూబాబాద్ జిల్లా అక్టోబర్ 19 వుదయం జిల్లా ప్రతినిధి):**

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యం (ఎల్నినో) కారణంగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని, క్షేత్రస్థాయిలో రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు, సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ, ఉద్యానవన, నీటి పారుదల, విద్యుత్, సంబంధిత అధికారులతో ఎల్నినోపై తీసుకోవలసిన చర్యలు గురించి సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....ఎల్నినో ప్రభావం వల్ల మహబూబాబాద్ జిల్లాలో ఈ వర్షాకాలంలో 889.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండే అని, ప్రస్తుతం 679.9 శాతం మిల్లీమీటర్ల మాత్రమే నమోదు అయిందన్నారు, మొత్తంగా జిల్లాలో మైనస్ 24 శాతం మాత్రమే వర్షపాతం నమోదు అయ్యిందన్నారు, గత సంవత్సరం ఇప్పటివరకు 1042.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయిందన్న అన్నారు. లోటు వర్షపాతం నమోదు కానీవి జిల్లాలో (10) మండలాలు కాగా, పాక్షికంగా (8) మండలాల్లో మాత్రమే వర్షం పడిందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో నేపథ్యంలో ( ఎల్ ని నో ) కారణంగా రైతులు వచ్చే సీజన్లో వరి పంట వేయవద్దని, ప్రత్యామ్నాయ పంటలు అయినా పప్పు దినుసులు, మినుములు, పెసర్లు, వేరుశెనగలు, కందులు, నూనె గింజలు, పొద్దు తిరుగుడు, కుసుమలు, నువ్వులు, తదితర అధిక డిమాండ్ ఉన్న పంటలను పండించాలని తద్వారా అధిక లాభాలు పొందవచ్చని కలెక్టర్ తెలిపారు, ఈ పంటలకు నీటి వనరులు తక్కువ అవసరం ఉంటాయని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగు చేయవచ్చు అని తెలిపారు, ఇటి పంటలను మార్కెటింగ్ చేయుటలో ఉద్యానవన శాఖ, స్వయం సహాయక బృందాల చేత మంచి మార్కెట్ కల్పించాలని, సంబంధిత అధికారులను ఆదేశించారు. విషయంలో క్షేత్రస్థాయిలో వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల శాఖ, విద్యుత్, తదితర అన్ని విభాగాల అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని, కరపత్రం, పోస్టర్లు, మెసేజ్ ల రూపంలో ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని తెలిపారు,

ప్రణాళికా ప్రకారం నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, త్రాగునీరు, సాగునీరు అవసరాలకు సరిపడా అంచనాలు గ్రామస్థాయిలో సిద్ధం చేసి ముందుకు సాగాలని, సూచించారు. విబిజీ రాంజీ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రవేశపెట్టిన పథకాలు ఫామ్ పాంట్, తదితర వ్యవసాయ ఆధారిత పనులు జిల్లాలోని సుమారు 5వేల మంది రైతులకు లబ్ధి చేకూరే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసి అమలుపరచాలని తెలిపారు, ఇప్పటికే జిల్లాలోని కొత్తగూడ, గంగారం, బయ్యారం మండలాలలో ప్రవేశపెట్టి అమలుపరచడం జరుగుతుందని అన్నారు.పంటలకు సరిపడా విద్యుత్తును పొదుపుగా అందించాలని, వసతి గృహాలలో త్రాగునీరు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని, రెడ్కు, సోలార్ పవర్ పాయింట్ లను వినియోగించుకోవాలని, అందుకు తీసుకోవలసిన చర్యల గురించి విద్యుత్ శాఖ వ్యవసాయ శాఖ అన్ని విభాగాల వారు ప్రత్యేక కార్యచరణ ద్వారా ముందుకు సాగాలని తెలిపారు. వివిధ సామాజిక మాధ్యమాలు, సోషల్ మీడియా, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల చేత, కళా ప్రదర్శనలు నిర్వహిస్తూ, సంబంధిత శాఖ వారు రైతుల ఫోన్ నెంబర్లకు నేరుగా మెసేజీలు పంపించాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎల్ నీ నో పై విస్తృతంగా ప్రచారం నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో కూడా ఒక రైతు వచ్చే సీజన్లో ఇబ్బంది పడకుండా ఉండేందుకు ముందస్తుగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని జిల్లాలో ఇప్పటికే మిషన్ వైవిధ్యం ద్వారా ప్రజల్లోకి వెళ్లడం జరుగుతుందని, కలెక్టర్ అన్నారు.

జిల్లాలో అక్టోబర్ 22 నుండి నవంబర్ 30 వరకు "కెత్ బచావో అభియాన్" మండలాల వారిగా గ్రామాల వారిగా క్లస్టర్ల వారిగా బ్లాక్ ల వారీగా ప్రత్యేక ప్రచార అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు, ఈ కార్యక్రమం ద్వారా రైతులలో పూర్తి అవగాహన పెంచి ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గ్రామాల వారిగా త్రాగునీరు, అవసరాలకు అనుగుణంగా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని, స్థానిక నీటి వనరులను ఉపయోగించుకోవడం కోసం సిద్ధంగా ఉండాలని, యాక్షన్ ప్లాన్ నివేదికను తనకు సమర్పించాలని కలెక్టర్ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలను ఆదేశించారు.

గ్రౌండ్ వాటర్, వాతావరణ పరిస్థితులు మార్కుల చేర్పుల నివేదికలను ఎప్పటికప్పుడు రైతులకు అందించి అపరి మొత్తం చేయాలని సంబంధిత అధికారులకు తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, హౌసింగ్ పిడి పురుషోత్తం, జిల్లా రెవెన్యూ అధికారిని నాగలక్ష్మి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, ఉద్యానవన శాఖ అధికారి జినుగు మరియన్నా, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస రావు, విద్యుత్తు, గ్రౌండ్ వాటర్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల జీవితాల్లో విజయాలు వెల్లివిరియాలి

**రాష్ట్ర ప్రజలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి దసరా శుభాకాంక్షలు**
**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి**
**అక్టోబర్ 19**



నల్లగొండ జిల్లా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు ఆయన హృదయపూర్వక దసరా శుభాకాంక్షలు తెలిపారు.చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి విజయదశమి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన బతుకమ్మ, దసరా పండుగలను ప్రజలందరూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలు, ఆశయాలు, విజయాలను తీసుకురావాలని కోరారు. జగన్మాత దుర్గాదేవి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, యువతకు ఉజ్వల భవిష్యత్తు లభించాలని, ప్రతి కుటుంబం సిరిసంపదలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకున్నారు.సమాజంలో ప్రేమ, సోదరభావం, ఐక్యత, సామరస్యం మరింత బలపడాలని పేర్కొన్నారు. ప్రజలందరూ కలిసికట్టుగా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. విజయదశమి ప్రతి ఇంటా ఆనందాన్ని, ప్రతి జీవితంలో విజయాన్ని నింపాలని ఆకాంక్షించారు.

## నల్లగొండ పట్టణ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

**పట్టణ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి**
**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి**
**అక్టోబర్ 19**



నల్లగొండ జిల్లా విజయానికి, ధర్మానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని నల్లగొండ పట్టణ ప్రజలందరికీ పట్టణ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి పండుగ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు నింపాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగ ప్రతి ఒక్కరిలో నూతన ఉత్సాహాన్ని, స్ఫూర్తిని నింపుతుందని పేర్కొన్నారు. నల్లగొండ పట్టణ ప్రజలందరూ ఐకమత్యంతో, సోదరభావంతో పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు. పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరిస్తూ, శాంతియుత వాతావరణంలో పండుగ వేడుకలను నిర్వహించుకోవాలని సూచించారు.

ఈ విజయదశమి ప్రతి కుటుంబంలో ఆనందాన్ని నింపాలని, ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని, నల్లగొండ పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు.

## త్రాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలి

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**
**నీటిని పొదుపుగా వాడుకోవాలి**
**ఈర్లపూడి చెరువును పరిశీలించిన మంత్రి**



**ఖమ్మం, వుదయం బ్యూరోఅక్టోబర్ - 19**

నీటిని పొదుపుగా, జాగ్రత్తగా వాడుకోవాలని, తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మంత్రి సోమవారం రఘునాథపాలెం మండలం ఈర్లపూడి చెరువును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నాగార్జున సాగర్ జలాల ఆధారంగా, మంచుకొండ లిఫ్ట్ ద్వారా నీటిని విడుదల చేసి ఈర్లపూడి చెరువును నింపడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం ఎల్నినో ప్రభావం తీవ్రంగా ఉన్నందున, రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందన్నారు. అలాగే సమీప కాలంలో వర్షాలు పడే సూచనలు తక్కువగా ఉన్నందున నీటిని ఎంతో జాగ్రత్తగా, పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చెరువులోని నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ వాడుకోవాలని సూచించారు. రైతులు నీటి అవసరం చాలా తక్కువతో సాగయ్యే ఆరుతడి పంటలు సాగు చేయాలని, వరి, మొక్కజొన్న లాంటి పంటలు సాగుచేయవద్దని సూచించారు. ఎల్నినో ప్రభావంతో వర్షాలు పడకపోవడంతో పాటు, ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలు ఉన్నాయని, నీరు, కరంట్ కొరత ఏర్పడే ప్రమాదం ఉందని మంత్రి అన్నారు. ప్రజలకు, పశు పక్ష్యాదులకు త్రాగునీరు ఎంతో ముఖ్యమని, నీటిని, కరంట్ ను పొదుపుగా వాడుకోవాలని మంత్రి తెలిపారు. ఈ పర్యటనలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, అధికారులు, ఉన్నారు

## ఈ విజయదశమి ప్రతి ఒక్కరికీ విజయాలను అందించాలి



**జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**
**సూర్యాపేట జిల్లా అక్టోబర్ 19)**
**(వుదయం ప్రతినిధి):**

విజయదశమి (దసరా) పర్వదినాన్ని పురస్కరించుకుని సూర్యాపేట జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శుభాకాంక్షలు తెలిపారు.

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రతి ఇంటా ఆనందోత్సాహాలను నింపాలని ఆకాంక్షించారు. దృఢమైన సంకల్పం, పట్టుదలతో ముందుకు సాగితే విజయం తప్పక సిద్ధిస్తుందనే స్ఫూర్తిని ఈ పండుగ అందిస్తుందని పేర్కొన్నారు. దుర్గాదేవి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో జీవించాలని, చేపట్టిన ప్రతి కార్యంలో విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, సానుకూలత, విజయాలను తీసుకురావాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరినారు.

## చెడుపై మంచి సాధించిన విజయమే విజయదశమి

**తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ దసరా పండుగ శుభాకాంక్షలు**
**తెలంగాణ రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పంతంగి వీరస్వామి గౌడ్.**
**సూర్యాపేట జిల్లా అక్టోబర్ 19)**
**(వుదయం ప్రతినిధి):**



చెడుపై మంచి సాధించిన విజయమే విజయదశమి వేదికగా ప్రాచుర్యంలోకి వచ్చిందని తెలంగాణ రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ జై గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ సామాజిక ఉద్యమకారుడు, పంతంగి వీరస్వామి గౌడ్ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో తన రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చరిత్ర ఇతిహాసాలు పురాణాల ఆధారంగా చెడుపై మంచి సాధించినందుకు సంకేతంగానే ప్రజలు విజయదశమి వేడుకలు జరుపుకుంటున్నారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు నవరాత్రిఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేయడం గొప్ప విషయం అన్నారు. సమాజం లో దైవ అనుగ్రహంతోనే మానవజాతి మనుగడ ఉంటుందని పంతంగి వీరస్వామి గౌడ్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడే విధంగా విజయదశమి వేడుకలు జరుపుకోవాలని సూచించారు. జమ్మి చెట్టు కొమ్మ పాలపిట్ట ల సాక్షిగా ప్రతి ఒక్క కుటుంబంలో ఆనందోత్సవాలు ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ విజయదశమి మరియు దీపావళి శుభాకాంక్షలు పంతంగి వీరస్వామి గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా రియల్ ఎస్టేట్ అధ్యక్షుడు జలగం సత్యం గౌడ్ రాష్ట్ర కార్యదర్శి అమరవాది శ్రవణ్ కుమార్,జిల్లా గౌరవ సలహాదారుడు దేవత్ కిషన్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెన్న శ్రీనివాస్ రెడ్డి జిల్లా కోశాధికారి పాల సైదులు పట్టణ గౌరవ సలదారుడు మాదిరెడ్డి గోపాల్ రెడ్డి పట్టణ రియల్ ఎస్టేట్ కార్యదర్శి అయితే గాని మల్లయ్య గౌడ్ సహాయ కార్యదర్శి ఆకుల మారయ్య గౌడ్, జిల్లా రియల్ ఎస్టేట్ ఉపాధ్యక్షుడు కోడి లింగయ్య, రాష్ట్ర కార్యదర్శి ఖమ్మం పాటీ అంజయ్య గౌడ్ పట్టేటీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ లో ఉంచొద్దు

- **కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్ ఆక్టోబర్ 19 (వుదయం ప్రతినిధి):**
ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి,
అధికారులతో కలిసి ప్రజల నుంచి 44 అర్జీలు స్వీకరించారు. అత్యధికంగా కరీంనగర్ నగరపాలికకు 19 దరఖాస్తులు వచ్చాయి.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం కల్లా శాఖల లాగిన్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.
వచ్చే సోమవారం నుంచి మొదటి గంటలో పెండింగ్ దరఖాస్తులను ప్రత్యక్షంగా పరిశీలిస్తానని ఈ లోగా అధికారులు లాగిన్ లో ఉన్న దరఖాస్తులను క్లియర్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్లు కాళీ చరణ్, మాధవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ ఆయుష్ మిషన్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
- **అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పోస్టుల భర్తీ**
- **అక్టోబర్ 22, నుంచి 27 వరకు దరఖాస్తుల స్వీకరణ**

**పెద్దపల్లి, అక్టోబర్ 19 (వుదయం ప్రతినిధి)**
పెద్దపల్లి జిల్లాలో జాతీయ ఆయుష్ మిషన్ కార్యక్రమం కింద ఆయుష్ పబ్లిక్ హెల్త్ ప్రోగ్రామ్‌లను నిర్వహించడానికి, తెలంగాణ సికింద్రాబాద్ ఆయుష్ శాఖ డైరెక్టర్ పరిపాలనా నియంత్రణలో పనిచేయుటకు అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ కేటగిరీల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**ఖాళీలు, వేతనం, అర్హతల వివరాలు:**
ఆయుష్ మెడికల్ ఆఫీసర్ 03 పోస్టులు
వేతనం: రూ. 40,000/ (నెలకు)
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ, బోర్డు నుండి ఆయుర్వేద, యునాని, హోమియోపతి, నేచురోపతి విధానంలో కనీసం 4½ సంవత్సరాల క్రమబద్ధమైన విద్య నభ్యసించి, 1 సంవత్సరం విధిగా ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన డిగ్రీ కలిగి ఉండాలి.ఫార్మాసిస్ట్ (01) పోస్ట్ వేతనం: రూ. 15,000 నెలకు అర్హత: డి.ఫార్మసీ , బి.ఫార్మసీ, ఫార్మాడి ఉత్తీర్ణులై ఉండాలని, తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌లో తప్పనిసరిగా రిజిస్టర్ అయి ఉండాలి.
సైకోసోషల్ కౌన్సెలర్ (01) పోస్ట్ , వేతనం: రూ. 500/ (ప్రతి సెషన్‌కు /సంవత్సరానికి కనీసం 200 విజిట్స్), అర్హత: మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ (MSW) పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.



యోగా ప్రొఫెషనల్ (01) పోస్ట్ ,వేతనం: రూ. 28,000/ (నెలకు), అర్హత: కనీసం 4 సంవత్సరాల క్రమబద్ధమైన విద్యతో పాటు 1 సంవత్సరం కంపల్సరీ ఇంటర్న్‌షిప్‌తో కూడిన నేచురోపతి డిగ్రీ, గుర్తింపు పొందిన యూనివర్సిటీ/బోర్డు నుండి 'డిప్లొమా ఇన్ నేచురోపతి అండ్ యోగిక్ సైన్సెస్ పూర్తి చేసి ఉండాలని సూచించారు. అభ్యర్థుల వయస్సు 18 నుండి 44 సంవత్సరాల మధ్య ఉండాలి. (ఎస్సీ, ఎస్టీ, బిసి, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, ఎక్స్‌సర్వీస్‌మెన్ అభ్యర్థులకు 3 సంవత్సరాల వయోసడలింపు ఉంటుంది.
దరఖాస్తు ఫారమ్, పూర్తి సూచనలను
https://www.peddapalli.telangana.gov.in పెద్దపల్లి జిల్లా అధికారిక వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.దరఖాస్తు రుసుము రూ. 300/ డిమాండ్ డ్రాఫ్ట్ (DD SBI A/C No: 45472549072) ను "GOVT. HOMOEO DISPENSARY DHARMARAM" పేరున తీసి దరఖాస్తుకు జతపరచాలి.నింపిన దరఖాస్తు ఫారమ్‌లను అవసరమైన సర్టిఫికెట్ల సెల్ఫ్‌అటెస్టెడ్ జిరాక్స్ కాపీలతో సహా అక్టోబర్ 22, నుంచి 27 వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పెద్దపల్లిలోని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో నేరుగా గానీ, రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా సమర్పించవచ్చని. గడువు దాటిన తర్వాత వచ్చే దరఖాస్తులు తిరస్కరించబడతాయని తెలిపారు.10వ తరగతి , ఇంటర్మీడియట్ సర్టిఫికెట్, అర్హత పరీక్ష పాస్ సర్టిఫికెట్ అన్ని సంవత్సరాల మార్క్స్ మెమోలు, బోర్డ్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (మెడికల్ ఆఫీసర్లకు)తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఫార్మాసిస్ట్ పోస్టుకు)
తహశీల్దార్ జారీ చేసిన కుల ధృవీకరణ పత్రం,
4వ తరగతి నుండి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు (ప్రైవేట్ అభ్యర్థులకు రెసిడెన్స్ సర్టిఫికెట్), దివ్యాంగులు (PH) సర్టిఫికెట్ ఎక్స్‌సర్వీస్‌మెన్ కోటా అభ్యర్థులకు సంబంధిత సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో అక్నాలెడ్జ్‌మెంట్ కార్డ్. అర్హత పరీక్షల్లో సాధించిన మార్కులు, వెయిటేజీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని, మెరిట్ జాబితాను జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో ప్రచురించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## ప్రజావాణికి 35 అర్జీలు

- **ఇల్లంతకుంటలో అత్యధికంగా 10 దరఖాస్తులు***

**రాజన్న సిరిసిల్ల, అక్టోబరు 19 (వుదయం ప్రతినిధి) :**
ప్రజావాణికి సోమవారం 35 దరఖాస్తులు వచ్చాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, సంబంధిత అధికారులకు అందజేశారు. వాటిని పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవో కార్యాలయాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి నిర్వహించారు. ఇల్లంతకుంటలో అత్యధికంగా 10, గంభీరావుపేటలో 4, చందుర్తి, తంగళ్లపల్లి, వేములవాడ రూరల్ మండలాల్లో ఒక్కో దరఖాస్తు వచ్చాయి. మిగిలిన మండలాల్లో అర్జీలు అందలేదు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లోనూ దరఖాస్తులు రాలేదు.ప్రతి సోమవారం ఐడీఓసీతోపాటు ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అర్జీలను అన్ని కార్యాలయాల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని పేర్కొన్నారు
.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

- **జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

**కామారెడ్డి, అక్టోబర్ 19 (వుదయం ప్రతినిధి):-**
రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకలుగా నిలిచే బతుకమ్మ, విజయదశమి (దసరా) పండుగలను పురస్కరించుకుని జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకృతిలో సహజంగా లభించే వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, మహిళలు, యువతులు, బాలికలు తొమ్మిది రోజుల పాటు సంప్రదాయబద్ధంగా ఆటపాటలతో బతుకమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించుకోవడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, సామూహిక ఐక్యతను చాటిచెప్పే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు.విజయదశమి పర్వదినం జిల్లా ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతిసౌభాగ్యాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు నింపాలని ఆకాంక్షించారు. దసరా పండుగ ప్రతి ఒక్కరిలో నూతనోత్సాహాన్ని నింపడంతో పాటు మరిన్ని విజయాలు సాధించేందుకు దోహదపడాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరూ బతుకమ్మ, విజయదశమి పండుగలను సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఈ సందర్భంగా సూచించారు.



## పల్లెల అభివృద్ధి పనులకు రూ.21 కోట్ల మంజూరు

- **రైతుల బాటలు, ఫీల్డ్ రోడ్లకు ప్రతిపాదనలు**
- **ఎమ్మెల్యే పాయల్ శంకర్**

**ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 19:**
పల్లెల అభివృద్ధే లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వివిధ పనుల కోసం రూ.21 కోట్ల నిధులు మంజూరు చేయించామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. రైతులు తమ పొలాలకు సులువుగా వెళ్లేందుకు బాటలు, ఫీల్డ్ రోడ్ల నిర్మాణం కోసం రూ.40 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని వెల్లడించారు. పిప్పల్‌గావ్‌లో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి సోమవారం ఆయన భూమిపూజ చేశారు.గ్రామాల్లో రహదారుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని పాయల్ శంకర్ తెలిపారు. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టడంతోపాటు, అవసరమైన చోట కొత్త రహదారులు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించామని చెప్పారు.ఆదిలాబాద్‌లో విమానాశ్రయం, పారిశ్రామిక పార్కు ఏర్పాటుతో జిల్లాలో అభివృద్ధికి కొత్త అవకాశాలు వస్తాయని ఎమ్మెల్యే అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు పెరిగేలా ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తన ప్రాధాన్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో పిప్పల్‌గావ్ సర్పంచ్ సంజు, ఉప సర్పంచ్, బీజేపీ నాయకులు కరుణాకర్ రెడ్డి, విజయ్, రాందాస్, సూర్య, రాకేశ్ రెడ్డి, రాకేశ్, ముకుంద్, భూమన్న, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## వెట్టి చాకిరి నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి

- **కార్మికుల హక్కులపై విస్తృత అవగాహన కల్పించాలి**
- **స్వేచ్ఛా రథం'ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి)19 అక్టోబర్ 2026**
వెట్టి చాకిరి నిర్మూలనకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, కార్మికుల హక్కులు, చట్టాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు.
రాష్ట్రవ్యాప్తంగా వెట్టి చాకిరి నిర్మూలన, కార్మికుల హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెట్టి చాకిరి వల్ల కలిగే అనర్థాలు, దాని నిర్మూలనకు ఉన్న చట్టాలు, కార్మికులకు కల్పించిన హక్కులపై నాటికలు, పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించే ఈ ప్రచార రథం ద్వారా వ్యవసాయ రంగం, ఇటుక బట్టీలు, మైనింగ్, క్వారీలతో పాటు ఇతర రంగాల్లో పనిచేసే అసంఘటిత కార్మికులకు తమ హక్కులపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వెట్టి చాకిరికి గురైన వారు, అలాంటి ఘటనలను గుర్తించిన వారు వెంటనే ఫిర్యాదు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 08069434343ను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. అనంతరం వెట్టి చాకిరి నిర్మూలనకు సంబంధించిన గోడప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెట్టి చాకిరి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, కార్మిక శాఖ అధికారి రాజలింగం, ప్రచార రథం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## చెన్నూర్ పట్టణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తాం....

- **రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద**

**మంచిర్యాల జిల్లా :**
చెన్నూర్ పట్టణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో 15వ వార్డులో అభివృద్ధి పనులకు అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ చెన్నూర్ పట్టణంలో రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు సహకరించడం అభినందనీయమని, ప్రజల సహకారంతోనే అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయగలమని తెలిపారు. డి.ఎం.ఎఫ్.టి. నిధుల ద్వారా 50 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, రోడ్డు విస్తరణలో భాగంగా దుకాణాలు కోల్పోయిన వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా 70 షాపులను కేటాయించేందుకు చర్యలు చేపట్టాలని, స్లాట్‌ల వారీగా కేటాయింపు ప్రక్రియను నిర్వహించి 3, 4 నెలలలో పూర్తి చేయాలని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలను తగ్గించి, లారీల రాకపోకల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా బైపాస్ రహదారి నిర్మాణానికి 1 కోటి 60 లక్షల రూపాయలతో పనులు చేపట్టే అంశాన్ని పరిశీలించి, పట్టణాన్ని ఆధునికంగా తీర్చిదిద్దేందుకు రహదారులు, డ్రైనేజీలు, మార్కెట్లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గోదావరి పుష్కరాల సందర్భంగా అవసరమైన ఏర్పాట్లు, అభివృద్ధి పనుల కోసం 6 కోట్ల రూపాయలతో పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్‌లోని శివాలయ అభివృద్ధికి 17 కోట్ల రూపాయలతో పనులు చేపట్టే అంశాన్ని పరిశీలించడం జరుగుతుందని, పుష్కరాలకు వచ్చే భక్తులకు, స్థానిక ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పట్టణంలోని అన్ని వార్డులలో సి.సి. డ్రైనేజీల నిర్మాణం చేపట్టి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కోసం 20 లక్షల రూపాయల నిధులు కేటాయించడం జరిగిందని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాన్‌వెజ్ మార్కెట్, ప్రజా మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ముదిరాజ్, మైనారిటీ, గౌడ తదితర వర్గాలకు అవసరమైన కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, సోమనపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు 200 కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 20 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం అల్పాహారం అందించే పథకం అమలవుతుందని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు, చదువుపై ఏకాగ్రత పెంపొందించేందుకు ఈ పథకం దోహదపడుతుందని తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత సమయంలో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. పట్టణాన్ని ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు.పట్టణంలోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి క్యాజువాలిటీ విభాగం, అత్యవసర వైద్య సేవల నిర్వహణ, రోగులకు అందిస్తున్న చికిత్స అంశాలను పరిశీలించి, సిబ్బంది హాజరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు, వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఆసుపత్రిలో రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సదుపాయాలు కల్పించాలని తెలిపారు. వైద్యులు సమన్వయంతో విధులు నిర్వహించాలని, ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన వైద్య పరికరాల వివరాలను తెలుసుకుని, వాటిని సమకూర్చేందుకు చర్యలు తీసుకోవాలని, అత్యవసర వైద్య సేవలకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్యం అందేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతతో పని చేయాలని, రోగులకు అవసరమైన వైద్య సదుపాయాలను మెరుగుపరుస్తూ, ఆసుపత్రి అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఆసుపత్రిలోని ఆర్.ఓ. ప్లాంట్‌ను పరిశీలించి, రోగులు, వారి సహాయకులకు శుద్ధి చేసిన త్రాగునీటిని అందించాలని, ఆసుపత్రి ప్రాంగణంలో పరిశుభ్రతను పాటిస్తూ, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు.పట్టణంలోని మధన పోచమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నూతన కమిటీ చైర్ పర్సన్ సతీష్, పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.
ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ మల్లికార్జున్, చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, చైర్‌పర్సన్ పెద్దింటి పద్మ, డి.సి.హెచ్.ఎస్. డా. కోటేశ్వర్ రావు, ఆసుపత్రి పర్యవేక్షకులు డా. సత్యనారాయణ, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



### ఈ విజయదశమి ప్రతి ఒక్కరికీ
## విజయాలను అందించాలి



- **జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన**
- **జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**

**జగిత్యాల అక్టోబర్ 19 (వుదయం ప్రతినిధి)**
విజయదశమి (దసరా) పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రతి ఇంటా ఆనందోత్సాహాలను నింపాలని ఆకాంక్షించారు దృఢమైన సంకల్పం పట్టుదలతో ముందుకు సాగితే విజయం తప్పక సిద్ధిస్తుందనే స్ఫూర్తిని ఈ పండుగ అందిస్తుందని పేర్కొన్నారు దుర్గాదేవి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో సిరిసంపదలతో జీవించాలని చేపట్టిన ప్రతి కార్యంలో విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు ఈ విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు సానుకూలత విజయాలను తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ కోరారు

## విజయదశమి అందరికీ విజయాలను చేకూర్చాలి





- **జిల్లా ఎస్పీ నితికా పంత్,**

**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి )**
కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రజలకు విజయదశమి పర్వదినం సుఖసంతోషాలు, విజయాలు, శాంతి, శ్రేయస్సును తీసుకురావాలని జిల్లా ఎస్పీ నితికా పంత్, ఆకాంక్షించారు.
విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా పోలీస్ ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లా ఎస్పీ నితికా పంత్, ఆయుధ పూజ, వాహన పూజ, జమ్మి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేసి, జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.శాంతి భద్రతల పరిరక్షణలో నిత్యం అప్రమత్తంగా ఉండే పోలీసులు తమ విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు, వాహనాలను దైవ స్వరూపంగా భావించి ప్రత్యేక పూజలు నిర్వహించడం పోలీస్ శాఖలో సాంప్రదాయంగా వస్తోంది" అని జిల్లా ఎస్పీ తెలిపారు.విజయదశమి పర్వదినం సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది పరస్పరం అలాయ్ బలాయ్ నిర్వహించుకుని, స్నేహపూర్వక వాతావరణంలో విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు,ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## భక్తులకు ఇబ్బందులు కలగొద్దు!

- **జంబి గద్దె, పిల్లి గుండ్ల ఆలయాల వద్ద ఏర్పాట్ల పరిశీలన.**
- **ఏర్పాట్లు పక్కాగా చేయాలి.. చైర్మన్ పుల్కం రాజు**

**వేములవాడ,అక్టోబర్ 19 (వుదయం ప్రతినిధి) :**
పండుగకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కౌన్సిలర్లు అధికారులకు సూచించారు. జంబి గద్దె, పిల్లి గుండ్ల అమ్మవారి ఆలయాలతో పాటు దేవుని సేవ తిరిగే ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ జంబి గద్దె పరిసరాలను మున్సిపల్ సిబ్బందితో పరిశుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. దేవుని సేవ వెళ్లే మార్గాల్లో రహదారులకు ఇరువైపులా ఉన్న చెట్లు, విద్యుత్ తీగలు, నీటి పైపులైన్ల వల్ల భక్తులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటామన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు భక్తుల రాకపోకలకు ఆటంకాలు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్, అన్నారం శ్రీనివాస్, కొక్కుల బాలకృష్ణ, తోట రాజు, కొండ రాజశేఖర్, ఆలయ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ విద్యార్థులకు ఉపకార వేతనాలు

**నాగిరెడ్డిపేట, అక్టోబర్ 19 (వుదయం):**
గోపాల్‌పేట తెలంగాణ మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాలలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు ప్రకటించినట్లు ప్రిన్సిపాల్ ఏ. రాంప్రసాద్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన డి. శ్రీనివాస్, డి. సునీత దంపతులు తమ తల్లిదండ్రులు నాగరాజు, లక్ష్మి నాచరమ్మల జ్ఞాపకార్థం ఈ ఉపకార వేతనాలను అందించేందుకు ముందుకొచ్చారని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2,000 చొప్పున మొత్తం రూ.12,000 అందజేయనున్నట్లు తెలిపారు. ఈ ఉపకార వేతనాలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించి, మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రోత్సహిస్తాయని రాంప్రసాద్ పేర్కొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, (వుదయం ప్రతినిధి), అక్టోబర్ 19:**
ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. జైనూర్‌కు చెందిన ఆత్రం శంభు నూతన మీ సేవా కేంద్రం మంజూరు చేయాలని కోరగా, జిల్లా కేంద్రానికి చెందిన వేములవాడ రవీందర్ అనారోగ్య కారణాలతో తన కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సిర్పూర్ (టి) మండలం లక్ష్మీపూర్‌కు చెందిన రాకేష్ కుమార్ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, చింతలమానేపల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన జుమ్మిడి అరుణ ఉపాధి కల్పించాలని దరఖాస్తు సమర్పించారు.అలాగే, కాగజ్‌నగర్ మండలం అనుకూడా గ్రామానికి చెందిన శంకర్ పాఠశాలలో వంటగది నిర్మాణానికి సంబంధించిన బిల్లు మంజూరు చేయాలని కోరారు. జైనూర్ మండలం పొలస గ్రామానికి చెందిన కుర్సింగ సురేఖ, ఆసిఫాబాద్ మండలం ఇప్పలనవేగాం గ్రామానికి చెందిన గుర్నూలె ఉషారాణి తమ గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల్లో ఉద్యోగ అవకాశం కల్పించాలని దరఖాస్తులు అందజేశారు.ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. గత ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు .ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.





మెదక్ జిల్లా/ అక్టోబర్ 19 అల్లదుర్గం /వుదయం// (ప్రతినిధి )

అల్లాదుర్గ్ మండలం గడీ పెద్దాపూర్ గ్రామంలో వెలసిన దుర్గామాత నవ రాత్రులు ఉత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ స్టేట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి

బిక్షపతి మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులు గ్రామానికి ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబంలో వెలుగులు నింపాలని, గడి పెద్దాపూర్ గ్రామస్తులకు బతుకమ్మ మరియు దసరా పండగ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పిఎసిస్ చైర్మన్ దుర్గా రెడ్డి మాజీ సర్పంచ్ చిన్న కృష్ణ గౌడ్, మాజీ ఎంపిటిసి విట్టల్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు దుర్గారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేష్ సెట్, సీనియర్ నాయకులు ప్రసాద్,క్రిష్ణగౌడ్,సాయి,అనిల్,అనిల్ గౌడ్,మహేష్, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

# కాలువ కడుపు కోసి.. కాసుల కోటలు!

- నెట్టెంపాడు ప్రధాన కాలువ వద్ద యథేచ్ఛగా ప్రభుత్వ ఆస్తుల లూటీ
- అభివృద్ధి ముసుగులో జేసీబీలతో తవ్వకాలు.. ట్రాక్టర్ ట్రాలీ రూ. 500 నుంచి 600లకు బహిరంగ అమ్మకాలు
- అధికారుల మౌనం.. అక్రమార్కులకు వరం!

**ఉల్లిగేపల్లిలో అంతుచిక్కని మట్టి మాఫియా దందాపై భగ్గుమంటున్న స్థానికులు**

**గద్వాల, అక్టోబర్ 19 (వుదయం బ్యూరో)**

ప్రభుత్వం ప్రజల కష్టార్జితంతో, వేల కోట్లు వెచ్చించి నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులు నేడు అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం ఉల్లిగేపల్లి గ్రామ పరిధిలోని నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువ సమీపంలో సాగుతున్న మట్టి దందా అరాచక స్థాయికి చేరింది. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులే అండగా నిలుస్తున్నారనే విమర్శలు వస్తుండటంతో.. కాలువ గట్లను జేసీబీలతో తవ్వి, పగటిలష్కర్‌లా మట్టిని



తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

దోపిడీకి అభివృద్ధి రంగు.. దొడ్డిదారిన దందా! గ్రామాభివృద్ధి పనులంటూ నయా కపట నాటకానికి తెరలేపిన కొందరు స్థానిక నాయకులు, అసాంఘిక శక్తులు ఈ దందాను సాగిస్తున్నారు. నెట్టెంపాడు ప్రధాన కాలువ ప్రాంతంలోని అత్యంత విలువైన మట్టిని రోజువారీగా వందలాది ట్రాక్టర్లతో అన్యాయంగా తరలిస్తున్నారు. కేవలం రవాణాతో ఆగకుండా.. ఒక్కో ట్రాక్టర్ ట్రాలీ మట్టిని బహిరంగ మార్కెట్‌లో రూ. 500 నుండి రూ. 600లకు అమ్ముకుంటూ జేబులు నింపుకొంటున్నారు. ప్రజల సంపద కళ్లెదుటే అన్యాక్రాంతం అవుతున్నా, అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక ఆంతర్యం ఏంటోనని స్థానికులు మండిపడుతున్నారు.

అనుమతుల' ముసుగులో అసలు బండారం! ఈ అక్రమ తవ్వకాలపై నిలదీస్తే.. కొందరు వ్యక్తులు పోలీసు, నీటిపారుదల, రెవెన్యూ శాఖల అనుమతులు ఉన్నాయంటూ బుకాయిస్తున్నట్లు తెలుస్తోంది. అసలు ఏ శాఖాధికారి ఏ ప్రాతిపదికన అనుమతిచ్చారు? ఎంత ఘనపరిమాణంలో త్రవ్వడానికి వెసులుబాటు కల్పించారు? ప్రభుత్వ మట్టిని అమ్ముకునే హక్కు ఎవరిచ్చింది? ఈ ప్రశ్నలకు మాత్రం ఎవరి దగ్గరా పొంతన లేని సమాధానాలే వస్తున్నాయి. కేవలం 'అనుమతులున్నాయి' అనే దొంగ మాటలతో కాలం వెళ్లదీస్తూ, తెరవెనుక కోట్ల విలువైన ప్రభుత్వ వనరులను కొల్లగొడుతున్నారు. లెక్కతేలని మట్టి.. దొరికినకాడికి దోచుకో! ఇప్పటివరకు ఈ ప్రాజెక్ట్ కాలువ ప్రాంతం నుంచి ఎన్ని వేల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించారు? రోజువారీగా సాగుతున్న ఈ ట్రాక్టర్ల దోపిడీ వెనుక ఉన్న అసలు సూత్రధారులు, అధికార పార్టీ నాయకులు ఎవరు?

వసూలు చేస్తున్న వేల రూపాయల నగదు ఎవరి ఖాతాల్లోకి, ఎవరి జేబుల్లోకి మాయమవుతోంది? దీనికి సంబంధించిన ఏ ఒక్క అధికారిక రికార్డు లేదా పంచాయతీ తీర్మానం అయినా ఉందా? ఇలా ప్రతీ అంశంపై తీవ్రమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఎలాంటి రికార్డులు లేకుండా సాగుతున్న ఈ అనధికారిక మాఫియా దందాపై సమగ్ర దర్యాప్తు జరిపితేనే అసలు బండారం బయటపడుతుంది. అధికారులు స్పందించాల్సిందే.. లేదంటే ప్రజా ఆగ్రహం తప్పదు! ప్రభుత్వ వనరులను ఇలా కళ్లెదుటే అక్రమార్కులు కొల్లగొడుతుంటే చోద్యం చూస్తున్న అధికారుల తీరుపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నీటిపారుదల, రెవెన్యూ, మైనింగ్ శాఖల ఉన్నతాధికారులు నిద్ర నుంచి మేల్కొని సంయుక్తంగా క్షేత్రస్థాయిలో విచారణ జరపాలి. నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, ఒకవేళ నిజంగా అనుమతులు ఉంటే ఆ పత్రాలను బహిరంగపరచాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ సంపదను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై లేదా అని నిలదీస్తున్నారు. ఈ మట్టి కుంభకోణంపై జిల్లా స్థాయి యంత్రాంగం ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి!



## భవానీ మాత ఆలయంలో అనిమిశెట్టి జయప్రకాష్ దంపతుల విశేష పూజలు

**సదాశివపేట అక్టోబర్ 19 (వు ద మం):**

సదాశివపేట: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సదాశివపేట పట్టణంలోని జై భవానీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ భవానీ మాత విగ్రహానికి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం సలహాదారులు అనిమిశెట్టి జయప్రకాష్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

అనంతరం అనిమిశెట్టి జయప్రకాష్ మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు, పశువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలు సమృద్ధిగా పండాలని, పశువులకు తగిన మేత, నీరు అందాలని, రాష్ట్రవ్యాప్తంగా సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని శ్రీ భవానీ మాతను ప్రార్థించినట్లు తెలిపారు.అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల కష్టాలు తొలగిపోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రధాన కార్యదర్శి మఠం రాచన్న స్వామి, జై భవాని యూత్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఆకుల శివకుమార్, అధ్యక్షులు శంకర్ గౌడ్, సంగమేశ్వర్ రెడ్డి కిరణ్ కుమార్ మునిపల్లి నాగు అనిల్ గౌడ్ చింటూ స్వామి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి



- రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ .
- ప్రజావాణికి 67 పిర్యాదుల స్వీకరణ.

**మహబూబ్ నగర్**

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ అధికారులకు ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ అర్జిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జిదారుల సమస్యలను రెవెన్యూ అదనపు కలెక్టర్ సావధానంగా విన్నారు. ప్రతి సమస్యను జాగ్రత్తగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి భరోసా ఇచ్చారు. అధికారులు ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా చదివి అర్థంచేసుకుని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని అన్నారు.ప్రజావాణిలో మున్సిపల్, పంచాయతీరాజ్, మహిళా ,శిశు సంక్షేమం, పౌరసరఫరాల శాఖ, భూ సర్వే రికార్డులు, గృహ నిర్మాణం, గిరిజన అభివృద్ధి శాఖ, విద్యుత్ శాఖ, విద్య, గ్రామీణ అభివృద్ధి,

తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 67 వినతులను అధికారులు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ ఎ.నిర్మల, డి.ఆర్.డి.ఓ నర్సింహులు,, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పండగ వేళ ఊరికి వెలుతురు కళ

**న్యాల్కల్ అక్టోబర్-19 (వుదయం ప్రతినిధి)**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం టేకుర్ గ్రామంలో సర్పంచ్ ఎంటుర్ సంగీత నగేశ్వర్ దసరా పండుగ సందర్భంగా గ్రామంలో సిట్ లైట్ ఎలక్ట్రిసిటీ వారికి చెప్పి తను దగ్గర ఉండి గ్రామంలో లైట్ అమర్చడం జరిగింది అదేవిధంగా టేకుర్ నుండి మిర్జాపూర్ ఎన్ శివార్ వరకు రోడ్డు పక్కన చెట్లకు వైట్ పెయింటింగ్ కూడా చేయడం జరిగింది ఎటువంటి సమస్యలు ఉన్న ప్రజా పాలన ప్రభుత్వ సాయంతోనా బాధ్యత తో గ్రామానికి నా వంతు సాయం చేస్తానని గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రజలకు సేవ చేయడమే నా లక్ష్యమని పేర్కొన్నారు గ్రామం అభివృద్ధి నా లక్ష్యమని పేర్కొన్నారు.

గ్రామ సర్పంచ్ &ఉపసర్పంచ్



గ్రామ ప్రజలందరికి దసరా శుభాకాంక్షలు తెలియజేసారు.

# తెలంగాణ సాంస్కృతికి పత్రిక బతుకమ్మ పండగ





**సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం**

(వుదయం ప్రతినిధి నాల్కకల్) అక్టోబర్ 19 ఆదివారం తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగను పురస్కరించుకొనిమండలంలోని మిర్జాపూర్ టేకూర్ వివిధ గ్రామాలలోసద్దుల బతుకమ్మ ను తీరక్క పూలతో బతుకమ్మను కుటుంబ సభ్యులతో అందంగా వివిధ రకాల రంగుల పూలతో బతుకమ్మను పేర్చి పండుగ శోభను చాటారు బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి మన సాంస్కృతిక సాంప్రదాయాలకు ప్రతీకగా ప్రకృతిని ఆదరిస్తూ బతుకమ్మ పండుగను పూలతో మహిళలు చిన్న పిల్లలు అందరూ కలిసి ఆటపాటలతో ఘనంగా ఈ పండుగను నిర్వహించుకున్నారుబతుకమ్మ పండుగ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ సంగీత నాగేశ్వర్, ఉప సర్పంచ్ నర్సింలు ,మాజీ సర్పంచులు ,గ్రామ ప్రజలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఘనంగా నిర్వహించుకున్నారు

# ప్రజావాణి కి 3 ఫిర్యాదులు



**నారాయణపేట అక్టోబర్ 19 (వుదయం ప్రతినిధి)**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను అధికారులకు సూచించారు.ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 3 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ ను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గ్లోబల్ గ్రీన్ కంపెనీలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు!

- రంగురంగుల పూలతో బతుకమ్మల అలంకరణ.. సంప్రదాయ దుస్తుల్లో మహిళల ఆటపాటలు

**కోహీర్, అక్టోబరు 19 (వుదయం ప్రతినిధి):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో ఉన్న గ్లోబల్ గ్రీన్ కంపెనీలో ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు, సంప్రదాయ దుస్తుల్లో మహిళల సందడి, ఆటపాటలతో కంపెనీ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిపారు.అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు, ఆటపాటలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. మహిళల సందడి, పూల బతుకమ్మల అందాలతో కంపెనీ ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది.




తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను కంపెనీ ప్రాంగణంలో నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఉద్యోగులు ఒకచోట చేరి సంప్రదాయబద్ధంగా సంబరాలు జరుపుకోవడంతో సంస్థలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఇటువంటి వేడుకలు ఉద్యోగుల్లో ఐక్యతను, పరస్పర స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని పలువురు పేర్కొన్నారు.ఈ బతుకమ్మ సంబరాల్లో రామయ్యతో పాటు కంపెనీ జనరల్ మేనేజర్ జె. శ్రీనివాసరావు, హెచ్ఆర్ విభాగం ప్రతినిధి టి. సుదర్శన రావు, ప్రొడక్షన్ హెడ్ వి.జె. మోహన్ గౌడ్, ఎల్. వెంకటేశ్వర్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎన్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మహిళలు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొనడంతో బతుకమ్మ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## కిషన్‌రావు పటేల్‌ను పరామర్శించిన జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుబ్బప్ప మచ్చేందర్

**మనుర్ , అక్టోబరు 19 (వుదయం ప్రతినిధి):**

మానూర్ మండలం దన్నారం గ్రామానికి చెందిన కిషన్‌రావు పటేల్ గారికి ఇటీవల గుండె శాస్త్ర చికిత్స జరిగిన విషయం తెలుసుకున్న *GMR ఫౌండేషన్ చైర్మన్, BRS పార్టీ నాయకులు గుబ్బప్ప మచ్చేందర్ * వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా కిషన్‌రావు పటేల్ గారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు.

ప్రజలకు కష్టసమయాల్లో అండగా నిలవడం, ఆపదలో ఉన్నవారిని పరామర్శించి మనోధైర్యం కల్పించడం తన బాధ్యతగా భావిస్తూ గుబ్బప్ప మచ్చేందర్ గారు చేపడుతున్న సేవా కార్యక్రమాలు స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి.



ఈ పరామర్శ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా సాగర సంగం గౌరవ అధ్యక్షులు, కృష్ణాపూర్ మాజీ ఎంపీటీసీ అంజయ్య సాగర్, నాగలిగిద్ద మాజీ వైస్ ఎంపీపీ పండరి యాదవ్, మాజీ ఎంపీటీసీ అమరే నాయక్, గ్రామ సర్పంచ్ అమృత్, రానాపూర్ సర్పంచ్ సంగారెడ్డి, మాజీ సర్పంచ్ సీధన్న, కృష్ణాపూర్ మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, BRS పార్టీ సీనియర్ నాయకులు బసవరాజు పటేల్,వెంకట్ రావు పటేల్, మారుతి రావు పటేల్,ప్రభాకర్, కాశీనాథ్ పటేల్,జీవన్ పటేల్,మహిపాల్ రెడ్డి,మాజీ వార్డు మెంబర్ సాయిలు,జర్నలిస్ట్ రాజు,అజయ్ గౌడ్, గుండప్ప, ఎన్. అమృత్, ఆనంద్, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

GMR సేవా నినాదం:

"ప్రజల కష్టాల్లో తోడుగా ఆపదలో అండగా నిరంతరం ప్రజాసేవే లక్ష్యంగా GMR ఫౌండేషన్."

## మాభూమి మాకు కావాలిమాకు న్యాయం చేయాలంటూ ఝరాసంగం ప్రజావాణిలో పిర్యాదు

**ఝరాసంగం అక్టోబర్-19(వుదయం ప్రతినిధి)**

ఝరాసంగం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఒక్క అర్జీ మాత్రమే రావడం జరిగింది. కుప్పానగర్ గ్రామానికి చెందిన కొనదొడ్డి. మొగులమ్మ భర్త మానెయ్య,కుప్పనగర్ గ్రామం లో మా భర్తకు ఇచ్చిన ప్రభుత్వ భూమియందు సర్వే నం:62 లో ఇచ్చిన పాత ధ్రువీకరణ పత్రంలో 5.ఎకరాలు,ఉంది. నా భర్త మరణానంతరం నా పేరు మీద కొత్త పట్టా పాస్ బుక్ లో 113. మాత్రమే నమోదు అయినట్లు ఉంది,కావున మిగతా మొత్తం భూమి నా పేరుమీద చేసి నాకు న్యాయం చేయాలని MRO గారికి పిర్యాదులో కోరడం జరిగింది. మండల రెవిన్యూ అధికారి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి నిర్వహించడం






జరుగుతుంది. ఇచ్చిన పిర్యాదును పరిశీలించి, రికార్డులలలో చెక్ చేసి వాస్తవాలను కనుక్కొని,ఇచ్చిన సమస్య ను ఉన్నత అధికారులకు పంపి న్యాయపరమైన పరిష్కారం అయ్యేటట్లు చేస్తామని చెప్పడం జరిగింది.కావున ప్రజలందరు ఈ ప్రజావాణి ని వినియోగించుకోవాలని కోరారు. ఈ ప్రజావాణి కార్యక్రమానికి MRO,APO, వివిధ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# యాసంగిలో నీటి పొదుపునకు ప్రాధాన్యం ఇవ్వాలి

- జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. యశ్వంత్‌రావు*

**నాగర్ కర్నూల్ రూరల్, అక్టోబర్ 19, (వుదయం ప్రతినిధి)**

ఎల్‌నినో ప్రభావం, వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని యాసంగి పంటల సాగులో రైతులు నీటి పొదుపునకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. యశ్వంత్‌రావు సూచించారు. ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకుంటూ తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే పంటలను ఎంచుకోవాలని కోరారు.పెసర, మినుములు, ఇతర పప్పుధాన్యాలు, ఆముదం, నువ్వుల సాగును ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. వానాకాలంలో వరి సాగు చేసిన రైతులు కోతల అనంతరం పొలాల్లో మిగిలిన తేమను వినియోగించుకుని పప్పుధాన్యాలు,



స్వల్పకాలిక పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించాలన్నారు.కాలువల ద్వారా పరిమితంగా నీరు అందే ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని, నీటి లభ్యతపై స్పష్టత లేకుండా అధిక నీరు అవసరమయ్యే వరి, మొక్కజొన్న వంటి పంటల సాగుపై జాగ్రత్త వహించాలని సూచించారు. గ్రామసభలు, రైతు సమావేశాలు, శిక్షణ కార్యక్రమాల ద్వారా పంటల ఎంపికపై అవగాహన కల్పించాలని, జిల్లా, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు సమన్వయంతో రైతులకు తగిన సలహాలు అందించాలని ఆయన పేర్కొన్నారు.

## పాలెం దేవాలయం లో మహిషాసుర మర్ధిని అవతారంలో అమ్మవారు



**బిజినపల్లి అక్టోబర్ 19 (వుదయం ప్రతినిధి)**

మండల పరిధిలోని పాలెం గ్రామంలో గల శ్రీ అలర్మేల్ మంగ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అమ్మ వారిని శ్రీ మహిషాసురమర్ధిని అవతారం లో అలంకరించారు. పూజలను పండితులు జయంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం ప్రత్యేకపూజలు, అభిషేకం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం శ్రీ దుర్గా హోమాన్నీ అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని బాలస్వామి భాగ్యమ్మ, ఆనంద్, రజిత దంపతులు పాల్గొన్నారు. సాయంత్రం కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారి శాన్వీ సింగ్ చేసిన భరతనాట్యం అందరిని ఆకట్టుకుంది. చిన్నారికి మాతృమండలి సభ్యులు శారద ,రాజేశ్వరి, మంజుల, అరుణ, సూర్యకళ తదితరులు సన్మానించారు. సాయంత్రం బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోవింద్ వెంకటేష్, అఖిలేష్, సాయి, దినేశ్, శశాంక్ శ్రీను, మాతృమండలి సబ్యులు, పుష్పలత, యాదమ్మ, , రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## మాగనూరులో స్మశానానికి దారేది

**మాగనూర్ అక్టోబర్ 19 (వుదయం న్యూస్)**

మండల కేంద్రమైన మాగనూరు గ్రామంలో గత మూడు సంవత్సరాల నుండి మన పూర్వీకులు నుండి కూడా మాగనూరు వాగులో శవాలను మన పూర్వీకులను పూడ్చడం జరుగుతుంది. ఇప్పుడు కొందరు ఇసుక మాఫియాలా ద్వారా వాగులో గుంతలు పడి పెద్ద నీటి కుంటలు ఏర్పాటు అవ్వడం జరిగింది దీని వలన మన గ్రామంలో ఎవరైనా చనిపోతే స్మశానానికి వెళ్లడానికి చాలా ఇబ్బందిగా నీటిలో మునిగి వెళ్లాల్సింది గా పరిస్థితి ఏర్పడింది. కనుక వెంటనే ఈ యొక్క దారిని వెంటనే సరైన మార్గాన్ని ఏర్పాటు చేసి స్మశానానికి దారి వేయాలని డివైఎఫ్ఐ గా ప్రజావాణిలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో బాలరాజు మాట్లాడుతూ ప్రజావాణిలో రెండవసారి ఫిర్యాదు చేయడం జరిగింది

మొదటిసారి ఫిర్యాదు పై అధికారులు గ్రామ సర్పంచ్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు కనుక ఇప్పటికైనా సరే అధికారులు సర్పంచ్ కలిసి స్మశానానికి సరైన దారి వేసి మార్గాన్ని చూపాలని ఆయన డిమాండ్ చేశారు.. అంతేకాకుండా ఈ



సంవత్సరంలో దాదాపు ఇద్దరు ఒకరు చిన్న పిల్లలు ఒక వ్యక్తి ఆ నీటి కుంటలో పడి చనిపోవడం కూడా జరిగింది కనుక దయచేసి అధికారులు వెంటనే స్పందించాలని ఆయన కోరారు. ఈ యొక్క కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు నరసింహ నయుం రాఘవేంద్ర నరేష్ సాకేత్ పాల్గొనడం జరిగింది.

# హెరిటేజ్ ఫుడ్స్ ఆదాయంలో 19 శాతం వృద్ధి

**క్యూ2లో రూ.1,319.6 కోట్ల ఆదాయం..**
**5.6 శాతానికి ఎబిట్డా మార్జిన్**

**హైదరాబాద్,**
హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ 202627 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో బలమైన ఫలితాలు నమోదు చేసింది. సెప్టెంబర్ 30తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ ఆదాయం గత ఏడాదితో పోలిస్తే 19 శాతం పెరిగి రూ.1,319.6 కోట్లకు చేరింది. ఎబిట్డా మార్జిన్ గత త్రైమాసికంతో పోలిస్తే 98 బేసిస్ పాయింట్లు మెరుగుపడి 5.6 శాతానికి చేరగా, నికర లాభం రూ.30.9 కోట్లుగా నమోదైంది.విలువ ఆధారిత ఉత్పత్తుల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. లస్సీ ఆదాయం 91 శాతం, ఐస్క్రీమ్ 81 శాతం, మజ్జిగ 66 శాతం, పనీర్ 38 శాతం, పెరుగు 26 శాతం వృద్ధి చెందాయి. పాల సేకరణ పరిమాణం కూడా వార్షికంగా 7 శాతం పెరిగింది.ఈ సందర్భంగా కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి మాట్లాడుతూ.. పెరుగుతున్న పాల సేకరణ వ్యయాల మధ్య కూడా ఆదాయ వృద్ధి, మార్జిన్ల మెరుగుదల సాధించడం సంతోషంగా ఉందన్నారు. పాల సేకరణ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, విలువ ఆధారిత ఉత్పత్తుల సామర్థ్యాన్ని పెంచడం, ప్రీమియం ఉత్పత్తుల్లో ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.
మరోవైపు, హెరిటేజ్ ఫుడ్స్‌కు చెందిన 6.3 మెగావాట్ల సామర్థ్యమున్న పవన విద్యుత్ కేంద్రానికి 202526 ఆర్థిక సంవత్సరానికి ఇండియన్ విండ్ పవర్ అసోసియేషన్ నుంచి 'బెస్ట్ పెర్ఫార్మింగ్ విండ్ ఫామ్' అవార్డు లభించింది.




# జియో ఐపీఓ ధమాకా

## యాంకర్ బుక్‌కే ₹2.5 లక్షల కోట్ల బిడ్లు!




**దిల్లీ:**
రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన టెలికాం, డిజిటల్ సేవల విభాగం జియో ప్లాట్‌ఫామ్స్ పబ్లిక్ ఇష్యూకు (Jio Platforms IPO) సంస్థాగత మదుపర్ల నుంచి అనూహ్య డిమాండ్ లభించింది. రూ.8,110 కోట్ల యాంకర్ బుక్ దాదాపు 30రెట్ల స్పందన అందుకుంది. మొత్తం రూ.2.5 లక్షల కోట్ల విలువైన బిడ్లు వచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. గ్లోబల్ అసెట్ మేనేజర్లు, సావరిన్ వెల్త్ ఫండ్స్, దేశీయ మ్యూచువల్ ఫండ్స్, బీమా సంస్థలు ఈ బిడ్డింగ్‌లో పాల్గొన్నాయి.యాంకర్ బుక్ ఇష్యూలో పాల్గొన్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థల్లో బ్లాక్‌రాక్, క్యాపిటల్ గ్రూప్, ఫిడెలిటీ ఇన్వెస్ట్‌మెంట్స్, టి.రో ప్రైస్, ష్రోడర్స్, జేపీ మోర్గాన్ అసెట్ మేనేజ్‌మెంట్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, ఇన్వెస్కో, జానస్ హెండర్సన్ ఉన్నాయి. సింగపూర్ జీఐసీ, అబుధాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, ఖతర్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, నార్వే నార్జెస్ బ్యాంక్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ వంటి సావరిన్, పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు కూడా పాల్గొన్నాయి. దేశీయ సంస్థలు కూడా యాంకర్ బుక్ ఇష్యూలో విరివిగా పాల్గొన్నాయి. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్, హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ మ్యూచువల్ ఫండ్, నిప్పాన్ ఇండియా మ్యూచువల్ ఫండ్, కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ వంటి ప్రముఖ మ్యూచువల్ ఫండ్ హౌస్‌లు ఇందులో పాల్గొన్నాయి. ఎల్ఐసీ, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఎస్‌బీఐ పెన్షన్ ఫండ్స్, హెచ్‌డీఎఫ్‌సీ పెన్షన్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ వంటి బీమా, పెన్షన్ ఇన్వెస్టర్లు కూడా ఈ ఆఫర్‌లో పాల్గొన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

జియో ప్లాట్‌ఫామ్స్ అక్టోబర్ 21న పబ్లిక్ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. 23న ముగుస్తుంది. మొత్తం రూ.30,213 కోట్లు సమీకరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. షేర్ ధర బ్యాండ్ రూ.1,065 నుంచి రూ.1,119గా నిర్ణయించారు. మొత్తం 27 కోట్ల కొత్త షేర్లను జారీ చేస్తున్నారు. ప్రధాన సబ్‌స్క్రిప్షన్‌కు ముందు యాంకర్ బుక్ ఇష్యూలో బలమైన డిమాండ్ కారణంగా.. మరింతమంది సంస్థాగత మదుపర్లు పబ్లిక్ ఇష్యూలో ఉత్సాహం

# పదేళ్ల వయసులోనే ప్రపంచ రికార్డు సృష్టించిన అర్షి గుప్తా




**వరుసగా రెండో ఏడాది జాతీయ కార్టింగ్ ఛాంపియన్‌షిప్ కైవసం**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 19, 2026:**
భారత యువ కార్టింగ్ రేసర్ అర్షి గుప్తా పదేళ్ల వయసులోనే ప్రపంచ స్థాయిలో అరుదైన ఘనత సాధించింది. తన పుట్టినరోజైన ఆదివారం జరిగిన ఎఫ్ఎంఎస్‌సీఐ రోటాక్స్ మ్యాక్స్ ఛాలెంజ్ ఇండియన్ నేషనల్ కార్టింగ్ ఛాంపియన్‌షిప్-2026లో మినీ మ్యాక్స్ విభాగంలో విజేతగా నిలిచి, ఈ విభాగంలో టైటిల్ గెలిచిన ప్రపంచంలోనే అత్యంత పిన్న వయస్కురాలిగా గుర్తింపు పొందింది.
గత ఏడాది మైక్రో మ్యాక్స్ విభాగంలో విజయం సాధించిన అర్షి, వరుసగా రెండేళ్లు రెండు విభాగాల్లో జాతీయ టైటిళ్లు గెలుచుకుంది. ఐదో రౌండ్ ఫైనల్ రేసులో వరుసగా ఎనిమిది వేగవంతమైన ల్యాప్‌లు నమోదు చేసి ట్రాక్ రికార్డును అధిగమించింది. బాలురు, బాలికలు ఒకే ట్రాక్‌పై పోటీపడే కార్టింగ్ క్రీడలో ఆసియాలో జాతీయ ఛాంపియన్‌గా నిలిచిన ఏకైక మహిళా రేసర్‌గా అర్షి కొనసాగుతోంది.ఎఫ్1 అకాడమీ 'డిస్కవర్ యువర్ డ్రైవ్' కార్యక్రమానికి ఎంపికైన ప్రపంచంలోనే అత్యంత పిన్న వయస్కురాలైన డ్రైవర్‌గా కూడా అర్షి గుర్తింపు పొందింది.
ఎఫ్ఐఏ అధ్యక్షుడి పతకాన్ని అందుకున్న ఆమె, యూఏఈ, యూకే పోటీల్లోనూ పతకాలు సాధించింది.
అర్షి తల్లిదండ్రులు డాక్టర్ దీప్తి గుప్తా, అంచిత్ గుప్తా మాట్లాడుతూ.. కఠినమైన శిక్షణ, నిరంతర ప్రయాణాలు, ఎన్నో సవాళ్లను అధిగమించి ఈ విజయాన్ని సాధించిందని తెలిపారు. 2025లో 137 రోజులు ట్రాక్‌పై శిక్షణ పొంది 29 రేసుల్లో పాల్గొన్న అర్షి, 2026లో ఇప్పటివరకు 140 ట్రాక్ రోజుల పాటు శిక్షణ తీసుకుని 30 రేసుల్లో పాల్గొందన్నారు. భారత్‌తో పాటు యూఏఈ, యూకే, శ్రీలంక, ఫ్రాన్స్‌లలోని 21 సర్క్యూట్లలో రేసింగ్, శిక్షణ పొందిందని వివరించారు. డీపీఎస్ ఫరీదాబాద్‌లో చదువుతున్న అర్షి, చదువుతో పాటు అంతర్జాతీయ రేసింగ్‌లోనూ రాణిస్తోందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బనితా సింగ్ తెలిపారు.
భవిష్యత్తులో మరింత వేగవంతమైన కార్టింగ్ విభాగాల్లో పోటీపడి, అంతర్జాతీయ మోటార్‌స్పోర్ట్స్‌లో అత్యున్నత స్థాయికి చేరుకుని భారత్‌కు ప్రాతినిధ్యం వహించడమే తన లక్ష్యమని అర్షి గుప్తా పేర్కొంది.

# కొవిడ్ కాలంలో ద్రవ్యోల్బణ లెక్కలు తలకిందులు

**హైదరాబాద్:**
కొవిడ్ మహమ్మారి సమయంలో దుకాణాల మూసివేత, రవాణా పరిమితులతో ధరల వివరాల సేకరణ కష్టమై ద్రవ్యోల్బణం అంచనాల్లో తేడాలు ఏర్పడ్డాయి. అప్పుడు తెలంగాణతో సహా పలు రాష్ట్రాల్లో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారంగా ద్రవ్యోల్బణాన్ని అంచనా వేయడంలో గణనీయమైన వ్యత్యాసాలు నమోదైనట్లు రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) తాజా అధ్యయనంలో తేలింది. 2016 సెప్టెంబరు నుంచి 2024 మే వరకు తెలంగాణ పట్టణ ద్రవ్యోల్బణం తక్షణ అంచనాల సగటు వర్గమూల తేడా (రూట్ మీన్ స్క్వేర్డ్ ఎర్రర్ ఆర్ఎంఎస్ఈ) 1.864 పాయింట్లుగా నమోదైంది. వాస్తవ విలువకు, అంచనా విలువకు ఎంత తేడా ఉందనేది ఆర్ఎంఎస్ఈ పాయింట్లలో చెబుతారు.

ఈ పాయింట్లు ఎంత తక్కువగా ఉంటే అంచనాలు కచ్చితత్వానికి అంత దగ్గరగా ఉన్నాయని అర్థం. మూడు నెలల ముందస్తు అంచనాలలో ఈ తేడా 2.064 పాయింట్లుగా




ఉంది. తక్షణ ద్రవ్యోల్బణ అంచనాల జాతీయ సగటు ఆర్ఎంఎస్ఈ 1.073 పాయింట్లుగా, మూడు నెలల ముందస్తు అంచనాల తేడా 1.178గా ఉంది. తెలంగాణలో ఈ విలువలు జాతీయ సగటుకంటే ఎక్కువగా నమోదయ్యాయి.
కొవిడ్ ప్రభావం వల్ల 2020 ఏప్రిల్, మే నెలలకు రాష్ట్రాలవారీగా అధికారిక ద్రవ్యోల్బణ గణాంకాలు అందుబాటులో లేకపోవడంతో, 2021లోనూ సంబంధిత నెలల ద్రవ్యోల్బణాన్ని లెక్కించడంలో అంతరాయం ఏర్పడింది.
విధాన నిర్ణయాలు, ప్రజలపైనా ప్రభావం
ద్రవ్యోల్బణ గణాంకాల్లో చిన్న వ్యత్యాసాలు కూడా ధరల తీరు విశ్లేషణ, రాష్ట్రాల మధ్య పోలికలు, ద్రవ్య విధాన నిర్ణయాలపై ప్రభావం చూపుతాయి. తెలంగాణలో ఆహార ధరలు, రవాణా వ్యయాలు, పన్నులు, సరఫరా వ్యవస్థలో మార్పుల ప్రభావాన్ని అంచనా వేయడానికి విశ్వసనీయ రాష్ట్రస్థాయి గణాంకాలు అవసరం.
ఉదాహరణకు ద్రవ్యోల్బణం తక్కువగా ఉంటే... ప్రజల కొనుగోలు శక్తికి ఊరట, వడ్డీ రేట్ల తగ్గింపునకు అవకాశం. ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉంటే కుటుంబాల ఖర్చులు పెరుగుతాయి. ద్రవ్య విధానంపై ఆర్‌బీఐ గట్టి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.
అంచనాలు తప్పుగా ఉంటే..ప్రభుత్వ విధాన నిర్ణయాలు, బడ్జెట్ ప్రణాళికలు, ఆర్‌బీఐ వడ్డీ రేట్లపై నిర్ణయాలు ప్రభావితమయ్యే ప్రమాదం ఉంది.
అందుకే ద్రవ్యోల్బణం ఎంత ఉందో తెలుసుకోవడం మాత్రమే కాకుండా, భవిష్యత్తులో ధరలు ఎలా మారతాయని ప్రజలు భావిస్తున్నారో తెలుసుకోవడం కూడా ఆబీఐకి చాలా కీలకం.




# చీఫ్ సెలక్టర్‌గా ప్రజ్ఞాన్ ఓజా.. రమేశ్ పవార్‌కు సెలక్టర్ పదవి



భారత క్రికెట్ బోర్డు చీఫ్ సెలక్టర్‌గా ప్రజ్ఞాన్ ఓజాకు అవకాశం దక్కింది. అజిత్ అగార్కర్ స్థానంలో ఓజా బాధ్యతలు తీసుకుంటాడు. అక్టోబర్ 4న అగార్కర్ పదవీకాలం ముగిసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఓజా తాత్కాలిక చీఫ్ సెలక్టర్‌గా ఉన్నాడు. ప్రజ్ఞాన్ ఓజా సౌత్ జోన్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. టీమ్ఇండియా తరఫున 24 టెస్టులు, 18 వన్డేలు, 6 టీ20ల్లో ఆడాడు. గతేడాది సెప్టెంబర్‌లో సెలక్టర్‌గా నియమితులైన సంగతి తెలిసిందే. అజిత్ అగార్కర్ స్థానంలో వెస్ట్ జోన్ నుంచి రమేశ్ పొవార్ సెలక్టర్‌గా ఎంపికయ్యాడు. అతడితోపాటు వసీం జాఫర్ కూడా దరఖాస్తు చేసుకున్నప్పటికీ.. ఇంటర్వ్యూలో రమేశ్ పొవార్ వైపే మేనేజ్‌మెంట్ మొగ్గు చూపించింది. భారత్ తరఫున రెండు టెస్టులు, 31 వన్డేలు ఆడిన పొవార్.. టీమ్ఇండియా మహిళా జట్టుకు కోచ్‌గానూ పనిచేసిన అనుభవం ఉంది.

# పారా ఆసియా గేమ్స్‌లో స్వర్ణాల మోత

## తొలిరోజే భారత్‌కు పతకాల పంట!

**పారా ఆసియా గేమ్స్‌లో వేట మొదలు..**
**షూటింగ్‌లో భారత్‌కు బంగారు పతకం**

ఆసియా పారా గేమ్స్‌లో భారత్ పతకాల వేట మొదలైంది. షూటింగ్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్ 1 విభాగంలో భారత్‌కు చెందిన ఇద్దరు షూటర్లు ఫైనల్‌లో తలపడ్డారు. అందులో మోనా అగర్వాల్ విజేతగా నిలిచి స్వర్ణం కైవసం చేసుకుంది. కేవలం 0.4 పాయింట్ల తేడాతో అవని లేఖర రజతంతో సరిపెట్టుకుంది. మోనా మొత్తం 250పాయింట్లు సాధించగా.. అవని 249.6 పాయింట్లు రాబట్టింది. ఇక దక్షిణ కొరియాకు చెందిన లీ యున్రి (227.9) మూడో స్థానంలో నిలిచి కాంస్యం దక్కించుకుంది. పురుషుల జూడో 70 కేజీల జే1 విభాగంలో కపిల్ పర్మార్ కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. కాంస్య పోరులో ఇండోనేషియాకు చెందిన అఫ్నాఫ్ రఫ్లిపై కపిల్ విజయం సాధించాడు. అంతకుముందు సెమీస్‌లో ఇండోనేషియాకు చెందిన జునాయిది చేతిలో 01 తేడాతో కపిల్ ఓటమిని చవిచూశాడు.ఆసియా పారా గేమ్స్‌లో భారత్‌కు రెండో స్వర్ణ పతకం లభించింది. పురుషుల టీ47 లాంగ్ జంప్ ఈవెంట్‌లో భారత అథ్లెట్ నిషద్ కుమార్ స్వర్ణం గెలుచుకున్నాడు.




7.11 మీటర్ల దూరం దూకి ఆయన ఈ ఘనత సాధించాడు. ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ఒమద్బెక్ ఖసనోవ్ రజతం, శ్రీలంకకు చెందిన మహమ్మద్ సఫ్రాన్ కాంస్యం గెలుచుకున్నారు.
జావెలిన్ త్రోలో స్వర్ణం..
జావెలిన్ త్రో ఎఫ్46 విభాగంలో స్వర్ణ, రజత పతకాలు భారత్‌నే వరించాయి. తొలి నుంచి అజీత్ సింగ్ (65.02 మీటర్లు) గోల్డ్ రేసులో ఉండగా.. రింకు ఒక్కసారిగా తన చివరి త్రోలో 65.11 మీటర్లు విసిరి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. దీంతో అజీత్ రజతంతో సరిపెట్టుకున్నాడు. మహిళల 1500 మీటర్ల టీ11 రేసులో రక్షిత రాజు కాంస్యం సాధించింది. తన రేసును 5:31.45 నిమిషాల్లో పూర్తి చేసింది.
జూడోలో పతకం ఖాయం
మహిళల జూడో 52 కేజీల జే2 విభాగంలో భారత్‌కు పతకం ఖాయమైంది. కోకిల ఫైనల్‌కు చేరుకుని సత్తా చాటింది. సెమీస్‌లో కోకిల 10 ఆధిక్యంతో చైనాకు చెందిన యు లియుపై విజయం సాధించింది. ఫైనల్‌లో కజకిస్థాన్‌కు చెందిన ఐబికె ఉలాన్బెక్‌తో స్వర్ణం కోసం పోరాడనుంది.
బుమ్రా మూడు ఫార్మాట్ల నుంచి విశ్రాంతి తీసుకోవాలి: రవిశాస్త్రి
బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ..
బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ భారత్‌కు పతకం ఖాయమైంది. నితీశ్ కుమార్ తులసిమతి మురుగేశన్ జోడీ ఎస్ఎల్ 3 ఎస్‌యూ 5 విభాగంలో సెమీస్‌కు దూసుకెళ్లింది. గ్రూప్ బిలో అజేయంగా నిలిచిన భారత్ జోడీ సెమీస్‌లో అడుగుపెట్టింది. తొలి మ్యాచ్‌లో భారత్‌కు వాకోవర్ వచ్చింది. రెండో మ్యాచ్‌లో చైనాకు చెందిన చెన్ పెంగ్‌ఫెయి హువాంగ్‌పై 214, 2118 తేడాతో భారత జోడీ విజయం సాధించింది.
శీతల్ సూపర్ రికార్డు
పారా మహిళా ఆర్చర్ శీతల్ దేవి అద్భుతమైన ప్రదర్శన చేసింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఆసియా గేమ్స్ రికార్డు నమోదు చేయగా.. ప్రపంచ రికార్డును సమం చేసింది. మహిళల కాంపౌండ్ క్వాలిఫికేషన్‌లో 750 పాయింట్లకుగాను శీతల్ 702 పాయింట్లు సాధించింది. చేతులు లేని ఆమె.. కాలితోనే ఆర్చరీలో అద్భుతాలు చేస్తోంది.

# ముగిసిన ఈక్వెస్ట్రియన్ పోటీలు

హైదరాబాద్: హెచ్‌పిఆర్‌సి ఆధ్వర్యంలో జరుగుతున్న రెండో జాతీయ క్వాలిఫయింగ్ ఈక్వెస్ట్రియన్ పోటీలు ఆదివారం ముగిసాయి. గండిపేటలో హైదరాబాద్ పోలో రైడింగ్ క్లబ్‌లో ఈ పోటీలు జరిగాయి. అండర్‌షో జంపింగ్‌లో సూర్యరామ్ (హ్యాపినెస్ క్లబ్) విజేతగా నిలిచాడు. ఇషాన్ భరద్వాజ్ (సలెర్నొ) రెండో, ఫ్రభ్‌నూర్ సింగ్ (మొనెట్ కార్లొస్) హస్త్రదక్ష స్థానంలో నిలిచాడు.
అండర్12 విభాగంలో నాగ్ హృదాన్ ములుగు (కింగ్) ప్రథమ స్థానంలో నిలువగా లువ్ మన్నె (డ్యూక్) రెండో, అనన్య రాథి (మిఛెల్ ఫ్రైడ్) మూడో స్థానాన్ని దక్కించుకున్నారు. షో జంపింగ్ ఓపెన్ కేటగిరిలో జగదీశ్ ఆర్చి (పవర్) మొదటి, తిరుమల్ (గుడ్‌లక్) రెండో, పుండరికక్ష (గ్లోరి) మూడో స్థానంలో నిలిచారు. విజేతలకు టిఎస్ఇఎ కార్యదర్శి రఘు పంచకర్ల, హెచ్‌పిఆర్‌సి ప్రతినిధుల చైతన్య కుమార్, షేక్ సిరాజ్ అహ్మద్ బహుమతులు అందజేశారు.




# టి20 సిరీస్ భారత్ కైవసం



**ప్రచురించబడింది అక్టో 19, 2026, 05:43 పూర్వాహ్నం | 2 నిమిషాల చదవడం**

**రెండో మ్యాచ్‌లో జింబాబ్వే మహిళలపై 9 వికెట్ల తేడాతో గెలుపు**

**రాయ్‌పూర్:**
జింబాబ్వేతో జరిగిన రెండో టి20లో మైదానంలో పదునైన బౌలింగ్, బ్యాటింగ్‌లో పరుగుల సునామీతో భారత మహిళల క్రికెట్ జట్టు 9 వికెట్ల తేడాతో జింబాబ్వేపై ఘన విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 20తో తిరుగులేని ఆధిక్యాన్ని సంపాదించి సిరీస్‌ను సొంతం చేసుకుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న జింబాబ్వే జట్టుకు భారత బౌలర్లు ఆదిలోనే చుక్కలు చూపించారు. నందిని శర్మ వేసిన అద్భుతమైన బంతికి కెలిస్ నధ్లోవు పరుగులేమీ చేయ కుండానే క్లీన్ బౌల్డ్ అయింది. ఆ తర్వాత క్రాంతి గౌడ్ బౌలింగ్‌లో దీప్తి పట్టిన అద్భు తమైన క్యాచ్‌కు షార్నే మేయర్స్ (9) పెవిలియన్ చేరింది. అయితే మధ్య వరుసలో చిపో ముగేరితిరిపానో (34), జోసెఫిన్ న్కోమో (27) పోరాడటంతో జింబాబ్వే జట్టు కోలుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో జింబాబ్వే 8 వికెట్ల నష్టానికి 102 పరుగులు మాత్రమే చేయగలిగింది. భారత బౌలర్లలో నికి ప్రసాద్ కేవలం 7 పరుగులిచ్చి 2 వికెట్లు తీసి ప్రత్యర్థిని దెబ్బతీసింది.స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత ఓపెనర్లు షెఫాలీ వర్మ, స్మృతి మంధాన జింబాబ్వే బౌలర్లపై విరుచుకుపడ్డారు. మొదటి ఓవర్ నుంచే బౌండరీల వర్షం కురిపిస్తూ పవర్‌ప్లేలోనే మ్యాచ్‌ను ఏకపక్షం చేశారు. వీరిద్దరూ మొదటి వికెట్‌కు కేవలం 8 ఓవర్లలోనే 96 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. షెఫాలీ వర్మ కేవలం 25 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 55 పరుగులు చేసి విధ్వంసం సృష్టించింది. చివర్లో బిజా బౌలింగ్‌లో ఆమె అవుటైనప్పటికీ, అప్పటికే భారత్ విజయం ఖాయమైంది. కెప్టెన్ స్మృతి మంధాన 25 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 47 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. దీంతో భారత్ కేవలం 8.5 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 104 పరుగులు చేసి ఘన విజయాన్ని అందుకుంది.

# నగోయాలో పారా ఆసియా గేమ్స్ హంగామా



**నగోయా :**
ఆసియా క్రీడలు ముగిసిన కొద్ది రోజుల్లోనే మరో ప్రతిష్ఠాత్మక పోరుకు తెరలేచింది. జపాన్‌లోని నగోయా నగరంలో 5వ పారా ఆసియా క్రీడలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ మెగా టోర్నీలో భారత పారా అథ్లెట్లు భారీ అంచనాలతో బరిలోకి దిగుతున్నారు. మొత్తం 11 క్రీడాంశాల్లో దేశం తరఫున 168 మంది అథ్లెట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. చైనా (హాంగ్‌జౌ)లో జరిగిన గత 2022 క్రీడల్లో భారత్ నుంచి రికార్డు స్థాయిలో 303 మంది అథ్లెట్లు పాల్గొని, 29 స్వర్ణాలతో సహా మొత్తం 111 పతకాలు కొల్లగొట్టారు. భారత స్టార్ జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్‌తో పాటు హైజంపర్ నిషాద్ కుమార్, స్ప్రింటర్ ప్రీతి పాల్‌లపై దేశం కొండంత ఆశలు పెట్టుకుంది. అలాగే ఆర్చరీలో శీతల్ దేవి, తోమన్ కుమార్.. బ్యాడ్మింటన్‌లో ప్రమోద్ భగత్, సుహాస్‌లు పసిడి పతకాలే లక్ష్యంగా రాణించనున్నారు. షూటింగ్, టేబుల్ టెన్నిస్ విభాగాల్లోనూ భారత్‌కు మెరుగైన పతక అవకాశాలు కనిపిస్తున్నాయి.తెలుగు రాష్ట్రాల నుంచి ఆరుగురు వీరులు క్రీడల అధికారిక ప్రారంభానికి ముందే శనివారం మొదలైన గ్రూప్ మ్యాచ్‌ల్లో భారత పారా షట్లర్లు అద్భుత ప్రదర్శనతో దూసుకుపోతున్నారు. మహిళల డబుల్స్‌లో మానసి జోషి తులసిమతి మురుగేశన్ జోడీ సెమీఫైనల్‌కు దూసుకెళ్లి, దేశానికి తొలి పతకాన్ని ఖాయం చేసింది. క్వార్టర్స్ పోరులో ఈ జోడీ 2110, 2117తో చైనాకు చెందిన యుమెయ్ లియు టాంగ్‌టాంగ్ జంటపై ఘన విజయం సాధించింది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో టోక్యో పారాలింపిక్స్ విజేత కృష్ణ వరుసగా రెండో విజయం నమోదు చేసి క్వార్టర్స్ బెర్తును దక్కించుకున్నాడు. ఇతర మ్యాచ్‌ల్లో నితేశ్ కుమార్ 216, 217తో చామ్‌నాన్వెట్ (థాయ్‌లాండ్)పై, స్టార్ ప్లేయర్ ప్రమోద్ భగత్ 2117, 2116తో షియాంగ్ (చైనా)పై ఘన విజయాలు సాధించారు. మహిళల సింగిల్స్‌లో నిత్యశ్రీ 2118, 2113తో లిన్ షాంగ్‌బావొ (చైనా)ను ఓడించగా, పురుషుల డబుల్స్‌లో సూర్యకాంత్ నవీన్ జోడీ 217, 2119తో మింగ్‌పన్ లిషియాంగ్ లిచువాన్ (చైనా) జంటపై పైచేయి సాధించింది. అయితే మహిళల సింగిల్స్‌లో మానసి జోషి 321, 321తో జపాన్ ప్లేయర్ షినో చేతిలో ఓటమి చవిచూసింది.

# 'మాలా' గీతంతో అలరిస్తున్న వెంకటేష్-త్రివిక్రమ్ చిత్రం!



వుదయం సినిమా : విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఆదర్శ కుటుంబం' నుంచి సంగీత సందడి కొనసాగుతోంది. ఇప్పటికే విడుదలైన తొలి పాటకు కొనసాగింపుగా, చిత్రంలోని రెండో గీతం 'మాలా' ఇప్పుడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తమన్ ఎస్ స్వరపరిచిన ఈ పాట వైవిధ్యమైన సంగీతంతో, రంగులమయమైన దృశ్యాలతో, ఉత్సాహభరితమైన నృత్యాలతో ఆకట్టుకుంటోంది.

ఈ పాటలో విక్టరీ వెంకటేష్, నివేదా పేతురాజ్ తమదైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో సందడి చేశారు. వీరిద్దరి కెమిస్ట్రీ, హుషారైన స్టెప్పులు, ఉత్సాహభరితమైన అభినయం పాటకు మరింత ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాటలోని జోష్‌కు తగినట్లుగా రూపొందించిన విజువల్స్ ప్రేక్షకులను అలరిస్తున్నాయి. 'మాలా' పాటకు తమన్ ఎస్, ధనుంజయ్ సీపాన, రణినా రెడ్డి గాత్రాన్ని అందించగా, రామజోగయ్య శాస్త్రి సాహిత్యం సమకూర్చారు. భాను మాస్టర్ నృత్య రీతులను రూపొందించారు. విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వస్తున్న ఈ చిత్రం భావోద్వేగాలు, వినోదం, కుటుంబ అనుబంధాలతో కూడిన సంపూర్ణ కుటుంబ కథాచిత్రంగా రూపొందుతోంది. త్రివిక్రమ్ శ్రీనివాస్ రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని హారికా అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. శ్రీమతి మమత సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రాఫర్ రవి కె. చంద్రన్ ఛాయాగ్రహణం అందిస్తుండగా, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఏ.ఎస్. ప్రకాశ్ కళా దర్శకత్వం వహిస్తున్నారు. తమన్ ఎస్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. కెవిన్ కుమార్ ఫైట్స్‌ను రూపొందిస్తున్నారు. రెండో పాట 'మాలా' విడుదలతో సంగీతపరంగా మరో ముందడుగు వేసిన చిత్ర బృందం, త్వరలోనే ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ట్రైలర్‌ను విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది. 'ఆదర్శ కుటుంబం' నుంచి రానున్న తదుపరి అప్‌డేట్స్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

## వుదయం సినిమా

# తెరపై అద్భుత దృశ్య కావ్యం 'రామాయణం'



వుదయం సినిమా : భారతీయ చలనచిత్ర చరిత్రలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న భవ్య దృశ్య కావ్యం 'రామాయణం' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులకు అపూర్వమైన సినిమా అనుభూతిని అందించనుందని చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈ చిత్ర తెలుగు ప్రీరిలీజ్ వేడుక భాగ్యనగరంలో అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ నటుడు రణ్‌బీర్ కపూర్ మాట్లాడుతూ, రాముడి పాత్రలో నటించడం అద్భుతమైన ప్రయాణమని, ప్రేక్షకులందరికీ ఇదొక మరువలేని అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. రావణాసురుడి పాత్రలో నటిస్తున్న రాకింగ్ స్టార్ యశ్ మాట్లాడుతూ, భారతీయ చలనచిత్రాన్ని ప్రపంచ స్థాయిలో అత్యున్నత శిఖరాలపై నిలపాలనే గొప్ప లక్ష్యంతో ఈ సినిమాను రూపొందించినట్లు తెలిపారు. సీతాదేవిగా జీవించిన నటి సాయి పల్లవి, ఈ ప్రయాణం తనకు జీవితాంతం గుర్తుండిపోయే అపురూప అనుభవమని అన్నారు.దర్శకుడు నితేష్ తివారీ మాట్లాడుతూ, తెలుగు సినిమాలపై తనకున్న ప్రత్యేక అభిమానాన్ని పంచుకుంటూ, ఈ ఇతిహాసాన్ని అత్యంత ప్రతిభతో, పకడ్బందీగా తెరకెక్కించినట్లు వెల్లడించారు. నిర్మాత నమిత్ మల్హోత్రా మాట్లాడుతూ, ప్రపంచ స్థాయి సాంకేతిక ప్రమాదాలతో ఈ చిత్రాన్ని ప్రేక్షకులకు అందిస్తున్నామని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను ప్రముఖ నిర్మాత దిల్ రాజు తమ ఎస్‌వీసీ సంస్థ ద్వారా భారీ ఎత్తున విడుదల చేస్తుండగా, ఉత్తరాదిలో ప్రఖ్యాత దర్శకనిర్మాత కరణ్ జోహార్ విడుదల చేస్తున్నారు. ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించిన రకుల్ ప్రీత్ సింగ్, రవి దూబే తదితరులు మాట్లాడుతూ ఈ చారిత్రక చిత్రంలో భాగం కావడం ఎంతో గర్వంగా ఉందని తెలిపారు. రెండు భాగాలుగా రూపుదిద్దుకుంటున్న ఈ మహా దృశ్యకావ్యం తొలి భాగం వచ్చే ఏడాది నవంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# పంజాగుట్ట రూమ్ జ్ఞాపకాల స్నేహబంధపు నవ్వులు



వుదయం సినిమా : కేవలం చలనచిత్ర ప్రచారాలకే పరిమితం కాకుండా, సినీ ప్రముఖుల జీవితాల్లోని గాఢమైన ఆత్మీయతలు, కష్టాలు, వ్యక్తిగత అనుభవాలను బహిర్గతం చేసినప్పుడే ఆ సంభాషణలు ప్రేక్షకులలో చెరగని ముద్ర వేస్తాయి. అలాంటి ఆసక్తికర విషయాలను ఆవిష్కరిస్తోంది 'జయమ్ము నిశ్చయమ్మురా విత్ జగపతి' రెండవ మలివిడత. ప్రముఖ నటుడు జగపతి బాబు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న ఈ జీ తెలుగు ముఖాముఖి కార్యక్రమంలో తెలుగు చిత్రసీమకు చెందిన దిగ్గజాలు పాల్గొంటున్నారు. సరదా వర్తమానాలు, పూర్వస్మృతులు, ఆంతరంగిక విషయాలు, అకస్మాత్తుగా పంచుకునే వినోదాత్మక సంఘటనలతో ఈ కార్యక్రమం ఆహ్లాదకరంగా సాగుతోంది. తాజా సంచికలో ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, నటుడు సునీల్, స్వరకర్త ఎస్.ఎస్. తమన్ సందడి చేయనున్నారు. తాజాగా విడుదలైన పూర్వదృశ్యంలో వీరి మధ్య సాగిన ఆసక్తికర సంభాషణలు, వ్యక్తిగత అనుభవాలు, సినీ రంగానికి చెందిన వారి స్నేహానుబంధాల విశేషాలు ఆకట్టుకుంటున్నాయి. సాధారణ ప్రతిభావంతుల ముఖాముఖి కార్యక్రమాలకు భిన్నంగా.. వెండితెర వెనుక ఉన్న వ్యక్తిత్వాలను ఆవిష్కరిస్తూ, తమ అనుబంధాన్ని నెమరువేసుకుంటూ సరదాగా ముచ్చటించిన తీరు ఈ ఎపిసోడ్‌ను ప్రత్యేకంగా నిలపనుంది.

ఈ సంచికలో ప్రధాన ఆకర్షణ త్రివిక్రమ్, సునీల్ మధ్య ఉన్న దశాబ్దాల మైత్రి. సినీ పరిశ్రమలో స్థిరపడకముందు.. ప్రారంభ రోజుల్లో పంజాగుట్టలోని ఒకే నివాసంలో కలసి గడిపిన కాలాలను వీరు గుర్తుచేసుకున్నారు. నాటి అనుభవాలు, స్మృతులను పంచుకుంటూ తమ సినీ ప్రయాణంలోని ఆసక్తికర విషయాలను వెల్లడించారు. వృత్తిపరంగా అపార విజయాలు సాధించిన వీరి వెనుక ఉన్న నాటి స్నేహం, ఆశయాలు, ఉమ్మడి అనుభవాలను ఈ ముచ్చట్లు తెలియజేస్తున్నాయి. త్రివిక్రమ్ వివాహ ప్రస్తావన వచ్చినప్పుడు జగపతి బాబు తనదైన శైలిలో సంభాషణను ఆసక్తికరంగా మలిచారు. దీనికి సునీల్ చమత్కరిస్తూ.. త్రివిక్రమ్‌ది 'కుదిర్చిన ప్రేమ వివాహం' అంటూ హాస్యాన్ని పండించారు. ఇలా ఒకరిపై ఒకరు హాస్య స్రవంతిని కురిపిస్తూ, తమ నడుమ ఉన్న సాన్నిహిత్యాన్ని చాటారు. కృత్రిమమైన సంభాషణలకు చోటులేకుండా, మిత్రుల మధ్య సహజంగా సాగే ముచ్చట్లతో వినోదాత్మక క్షణాలు రూపుదిద్దుకున్నాయి.ఎస్.ఎస్. తమన్ రాకతో

# 'సీన్' చిత్రం నుంచి 'ఏరోప్లేన్' గీతం ఆవిష్కరణ



వుదయం సినిమా : ప్రముఖ కథానాయకుడు సూర్య, మలయాళంలో విశేష విజయాన్ని సాధించిన 'ఆవేశం' చిత్ర దర్శకుడు జిత్తు మాధవన్‌లతో కలసి సాహసవినోదాత్మక చిత్రంగా 'సీన్' చేస్తున్నారు. ఈ చిత్రంలో నజ్రియా నజీమ్ కథానాయికగా నటిస్తుండగా, ఆనంద్ రాజ్, లాల్, రాజ్ ప్రియన్ ముఖ్యమైన పాత్రలను పోషిస్తున్నారు. జ్యోతిక, సూర్య సంయుక్తంగా జాగరం స్టూడియోస్, 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, జయశ్రీ దామోదరన్ సహ నిర్వాహకురాలిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల ఈ చిత్ర బృందం ఆవిష్కరించిన నామధేయ పరిచయ దృశ్యం (టైటిల్ టీజర్) చిత్రంలోని విచిత్రమైన, వినోదభరిత వాతావరణాన్ని వీక్షకులకు పరిచయం చేసింది. అలాగే పూర్వమే విడుదలైన ప్రథమ గీతం 'అమ్మో ఇది ఎవర్రా' శ్రోతల నుంచి అద్భుతమైన ఆదరణ పొందింది.

కాగా, తాజాగా విడుదల చేసిన ద్వితీయ గీతం 'ఏరోప్లేన్' అత్యంత ఉత్సాహపూరితమైన శైలిలో అలరిస్తోంది. సుశిన్ శ్యామ్ స్వరపరిచిన ఈ పాట ఆకట్టుకునే తాళాల వరసలతో శ్రోతలను మైమరపిస్తోంది. ముఖేష్ మహమ్మద్ అందించిన శక్తివంతమైన గాత్రం, రాకేందు మౌళి అందించిన సులువైన పదాల సాహిత్యం ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సూర్య, నజ్రియా నజీమ్‌ల మధ్య సాగిన వినోదాత్మక సాన్నిహిత్యాన్ని ఎంతో అద్భుతంగా ఆవిష్కరించిన ఈ గీతం ప్రస్తుతం అంతర్జాలంలో (సోషల్ మీడియాలో) విశేషంగా ప్రచారమవుతోంది. ఈ చిత్రానికి వినీత్ అగస్టిన్ ఛాయాగ్రహణం అందిస్తుండగా, సుశిన్ శ్యామ్ సంగీత బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. అజ్మల్ సాబు కూర్పు బాధ్యతలను, అశ్విని కాలే కళా దర్శకత్వాన్ని నిర్వహిస్తున్నారు. 'సీన్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2026 నవంబర్ 6న దీపావళి పండగ కానుకగా ప్రదర్శనశాలల్లో (థియేటర్లలో) విడుదలకు సిద్ధమవుతోంది.

# సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రామ్ #RAPO23





వుదయం సినిమా : ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన ప్రతిష్ఠాత్మక చిత్రం #RAPO23 కోసం హీరోగా, దర్శకుడిగా రెండు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఈ సినిమాను శరవేగంగా తెరకెక్కిస్తున్నారు. రామ్ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై నిర్మాత కృష్ణ పోతినేని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. బాలీవుడ్‌లో విభిన్నమైన పాత్రలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న రితేశ్ దేశ్‌ముఖ్ #RAPO23తో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టబోతున్నారు. 'ఏక్ విలన్', 'రైడ్ 2'తో పాటు ఇటీవల బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'రాజా శివాజీ' వంటి చిత్రాల్లో అద్భుతంగా నటించి ప్రేక్షకులని అలరించారు. #RAPO23 కోసం రామ్ పోతినేని ఈ కథకు, తొలిసారిగా తెరకెక్కిస్తున్న నియోనాయర్ వరల్డ్‌కి మరింత బలాన్ని చేకూర్చేలా నటీనటులు, సాంకేతిక బృందాన్ని ఎంతో జాగ్రత్తగా ఎంపిక చేస్తున్నారు. ఇప్పుడు రితేశ్ దేశ్‌ముఖ్ వంటి నటుడిని కీలక పాత్ర కోసం తీసుకోవడం ఈ ప్రాజెక్ట్‌ను ఎంత ప్రత్యేకంగా రూపొందిస్తున్నారో తెలియజేస్తోంది. సినిమా కథతో పాటు తన పాత్ర కూడా నచ్చడంతో రితేశ్ దేశ్‌ముఖ్ వెంటనే ఈ ప్రాజెక్ట్‌కు అంగీకారం తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న షూటింగ్ షెడ్యూల్‌లో ఆయన పాల్గొన్నారు. చిత్ర బృందం తాజాగా షూటింగ్ లొకేషన్‌లో తీసిన వీడియోను విడుదల చేసింది. సినిమాలోని భారీ సెట్‌ను ఈ వీడియోలో చూపించారు. వీడియోలో రితేశ్ దేశ్‌ముఖ్ సెట్‌లోకి అడుగుపెడుతున్న దృశ్యాలు కనిపిస్తాయి. అక్కడ హీరో, దర్శకుడు రామ్ పోతినేని ఆయనకు ఆత్మీయంగా హగ్ ఇచ్చి స్వాగతం పలికారు. ఈ బీటీఎస్ వీడియో ప్రస్తుతం సినిమా అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. టాలీవుడ్ లక్కీ చార్మ్ సంయుక్త ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్నారు. మరికొందరు ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. జాతీయ అవార్డు గ్రహీత సినిమాటోగ్రాఫర్ తిరునవుక్కరసు ( తిరు) ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.

# విహారి దర్శకత్వంలో 'భగవంతుడు'

## 'ఓ యెల్లమ్మ' పాటతో అలరిస్తున్న చిత్ర బృందం!



వుదయం సినిమా : యంగ్ టాలెంటెడ్ హీరో తిరువీర్, యంగ్ టాలెంటెడ్ హీరోయిన్ ఫరియా అబ్దుల్లా నటిస్తున్న తాజా చిత్రం "భగవంతుడు". ఈ సినిమాలో కన్నడ నటుడు రిషి కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని రవి పనస ఫిలిం కార్పొరేషన్ (పనస మీడియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్) బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 1గా నిర్మాత రవి కుమార్ పనస నిర్మిస్తున్నారు. విద్యా శ్రీ పనస సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాతో జి.జి. విహారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రొమాంటిక్ పీరియడ్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న "భగవంతుడు" సినిమా త్వరలోనే ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ రోజు "భగవంతుడు" సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'ఓ యెల్లమ్మ' పాటను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ పాటను ఎస్. కృష్ణ ప్రసాద్ డివైన్ ట్యూన్ తో కంపోజ్ చేయగా అడ్డుల జంగిరెడ్డి పాడారు. ఈ పాటకు మూవీ డైరెక్టర్ జి.జి.విహారి లిరిక్స్ రాయడం విశేషం. 'ఓ యెల్లమ్మ' పాట ఎలా ఉందో చూస్తే 'యెల్లమ్మ అంటే ఎవరనుకున్నరు? సూర్యవంశ రాజులింట రేణుకమ్మ పుట్టెరా, దుర్గమ్మే వరమిచ్చిన ఆదిశక్తి అంశరా, అగ్గిలోంచి పుట్టినట్టి అయోనిజ తల్లిరా, జమదగ్నే మనువాడిన ముత్తైదువ అమ్మరా, తల్లి సేయి తాకి ఇసుక కడవయ్యి నిలుసురా, నాగుపాము తలనెక్కి తలపాగా సుట్టురా, నదులన్నీ ఒదిగొచ్చి కడవ నిండిపోవురా, వనవాసం కోసమని రాణీవాసం వదిలేసిన ధర్మపత్ని రేణుకమ్మరా...' అంటూ మనసునిండా భక్తిభావం నింపేలా సాగుతుందీ పాట.




వుదయం సినిమా : విజయదశమి పర్వదిన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని భక్తిరస కథాంశంతో రూపుదిద్దుకున్న 'జయహో రామానుజ' చిత్ర బృందం ఒక విశేష ఉమ్మడి ముఖాముఖి (కామన్ ఇంటర్వ్యూ) కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ ముఖాముఖి వేదికగా చిత్రానికి సంబంధించిన అనేక ముఖ్యాంశాలు, కథా వైశిష్ట్యం, నటీనటుల అభినయ అనుభవాలు మరియు నిర్మాణంలో ఎదురైన ఆసక్తికర ఘట్టాలను వీక్షకులతో పంచుకున్నారు. దసరా పండుగ కానుకగా ఆవిష్కరించిన ఈ విశేష సంభాషణ ద్వారా వీక్షకులకు మరియు భక్తులకు ఈ సినిమా అంతరార్థంపై మరిన్ని ఆసక్తికర విషయాలు విశదీకరింపబడ్డాయి. సమగ్ర ఆధ్యాత్మిక అనుభూతిని పంచేందుకు సిద్ధమవుతున్న 'జయహో రామానుజ' చిత్రం అక్టోబర్ 24వ తేదీన ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శనశాలల్లో (థియేటర్లలో) అత్యంత ఘనంగా విడుదల కానుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల ముందుకు అక్టోబర్ 24న ఈ భక్తిరస కావ్యం రాబోతుండటంతో చిత్రసీమలో మరియు శ్రోతలలో విశేష ఆసక్తి నెలకొంది.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.